

కలువల సృష్టికర్త!
- అనేక వర్ణాలతో సరికొత్త పూలు
- 100 రకాల కలువ మొక్కలకు ప్రాణం
- విదేశీ హైబ్రిడైజర్‌లతో పరిచయం
- మధురవాడకు చెందిన అనలేందు రాజుకు ఘనత

-8లో



పల్లెల్లో అభివృద్ధి పండుగ

శరవేగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం

- పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు పోటీ
- గత ప్రభుత్వ హయానికి భిన్నంగా పరిస్థితి
- డిసెంబరు చివరినాటికి పనులు పూర్తి
- సంక్రాంతి పండుగ సమయంలో ప్రారంభోత్సవాలు
- చోడవరం నియోజకవర్గంలో రూ.20.21 కోట్లతో అభివృద్ధి పనులు



చోడవరం టీచర్స్ కాలనీలో డ్రైనేజీ కాలువలు నిర్మించి, సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

చోడవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఐదేళ్లపాటు అభివృద్ధి జాడలేని గ్రామాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు జోరుగా సాగుతు న్నాయి. నిన్న మొన్నటి వరకు వర్షం కురిస్తే అడుగు తీసి అడుగు వేయడానికి వీలుకాని విధంగా వున్న రహదారులు ఇప్పుడు సిమెంట్ కాంక్రీట్‌తో ముస్తాబవుతున్నాయి. ఉపాధి హామీ పథకం నిధులతో ప్రస్తుతం అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వైసీపీ హయాంలో ఉపాధి నిధులతో పనులు చేపడితే బిల్లులు వస్తాయో, లేదో అన్న అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుతోపాటు, ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులకు వెంటనే బిల్లులు మంజూరవుతుండడంతో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులు పోటీ పడుతున్నారు. దీంతో ఏ పని, ఎవరికి కేటాయించాలో తేల్చుకోలేని పరిస్థితిలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు వున్నారు.

చోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద తొలివిడత రూ.20.21 కోట్లు మంజూ రయ్యాయి. వీటితో 190 సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. రోలుగుంట మండలంలో రూ.5 కోట్ల 3 లక్షలతో 15 పనులు, రావికమతంలో రూ.3 కోట్ల 24 లక్షలతో 32 పనులు

... మిగతా 8వ పేజీలో



చోడవరం కోఆపరేటివ్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్

మరిన్ని నిధులు తెస్తాం



కూటమి ప్రభుత్వం రాజకీయాలకంటే అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తున్నది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకే విడుదల చేస్తున్నాం. తొలివిడత మంజూరైన నిధులతో చేపట్టిన పనులు డిసెంబరు నెలాఖరునాటికి పూర్తవుతాయి. తరువాత మరిన్నినిధులు తెచ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. గ్రామాల్లో అవసరమైన చోటా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తాం.

- కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్యే, చోడవరం

డిసెంబరులోగా పనులన్నీ పూర్తి



చోడవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ డిసెంబరు నెలాఖరు లోగా పూర్తిచేయిస్తాం. సంక్రాంతి పండగ సమయంలో ప్రారంభోత్సవాలు జరుగుతాయి. నాణ్యత విషయంలో నిక్కచ్చిగా ఉంటున్నాం.

- జీఎస్ఎస్ ప్రసాద్, డీఈ, పంచాయతీ రాజ్ సబ్‌డివిజన్, చోడవరం

పక్కాగా ధాన్యం కొనుగోలు

- రైతుల నుంచి 50 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం
- వచ్చే నెల మొదటి వారం నుంచి సేకరణ ప్రారంభం
- రైతుకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యం తరలించే వెసులుబాటు
- 48 గంటల్లో బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ
- ప్రభుత్వమే రవాణా చార్జీలు చెల్లింపు

జిల్లాలో 72 సేకరణ కేంద్రాలు



మునగపాకలో ప్రారంభమైన వరి కోతలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో పండించిన ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికారులు పటిష్ఠ ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. ఇందుకోసం మొత్తం 72 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 50 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు కాస్త ఆలస్యమైనప్పటికీ తరువాత వర్షాలు అనుకూలించడంతో పంట బాగానే పడింది. ముందస్తుగా వరినాట్లు వేసి పొలాల్లో ఇప్పటికే వరికోతలు మొదలయ్యాయి. ఈ నెలాఖరు నుంచి వరి కోతలు ఊపందుకుంటాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వరి సాగు ఆశాజనకంగా వుండడంతో 70 వేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులను కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలో 50 రైతు సేవా కేంద్రాలు, 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు.. మొత్తం 72 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధాన్యం సేకరిస్తారు.

వైసీపీ హయాంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు నానాపాట్లు పడ్డారు. ధాన్యం విక్రయించిన తరువాత డబ్బుల కోసం నెలల తరబడిగా ఎదురు చూడాల్సిన పరిస్థితి వుండేది. డబ్బుల గురించి స్థానిక అధికారులను అడిగితే.. తమ చేతుల్లో ఏమీ లేదని చెప్పేవారు. ఈ నేపథ్యంలో ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లో బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. అంతేకాక ధాన్యం విక్రయించే విషయంలో నిబంధనలను సులభతరళం చేసింది. ఈ మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. గ్రేడ్ 'ఎ' రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకం అయితే రూ.2,300కు కొనుగోలు చేస్తారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 33 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నా చివరకు 17 వేల టన్నులు మాత్రమే సేకరించారు. అయితే ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురిసి, వరి సాగు బాగుండడడం, మరోవైపు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులకు డబ్బులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఖరీఫ్ సీజన్‌లో 50 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని కొలిచే యంత్రాలు, గోనె సంచులను సిద్ధం చేస్తున్నారు. కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు ప్రభుత్వం రవాణా చార్జీలు చెల్లించనుంది.

ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చు

వైసీపీ హయాంలో ఏ రైతు, ఏ రైస్ మిల్లుకు ధాన్యం విక్రయించాలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నిర్ణయించేవారు. ఈ విధానంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని మండలాల రైతులకు 50-60 కిలోమీటర్ల దూరంలో వున్న రైస్ మిల్లులను కేటాయించారు. పైగా రవాణా చార్జీలను రైతులే భరించాల్సి వచ్చింది. ఈసారి అటువంటి ఇబ్బందులు లేకుండా రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకి ధాన్యం తరలించే వెసులుబాటు కల్పించింది. అంతే కాకుండా కొత్తగా వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యాన్ని అమ్ముకొనే అవకాశం కల్పించనున్నారు. రైతులు తాము నిర్ణయించుకున్న రోజున ధాన్యం విక్రయించడానికి వాట్సాప్‌లో వివరాలు పంపడం ద్వారా స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు.

తాండవలో ఎండుతున్న వరి



తాండవ 8వ కిలోమీటరు వద్ద నీరు ప్రవహించని కుడికాలువ

ఆయకట్టు చివరి భూములకు అందని నీరు

- కాలువల్లో పేరుకుపోయిన పూడిక, నాచు
- తుప్పు పట్టి పాడైన రెగ్యులేటింగ్ గేట్లు
- రెండేళ్ల నుంచి పట్టించుకోని అధికారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

నాతవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఆయకట్టు చివరి భూములకు నీరు అందని పరిస్థితి నెలకొంది. వరి పైరు వెన్ను, గింజ కట్టే దశలో నీరు లేకపోవడంతో వడ్ల గింజలు పొల్లుగా మారతాయని రైతులు వాపోతున్నారు. ప్రధాన కాలువల్లో రెండేళ్ల నుంచి పూడికలు తీయకపోవడం, పిల్ల కాలువల రెగ్యులేటర్ల గేట్లకు మరమ్మతులు చేయక పోవడంతో తమ భూములకు నీరు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండవ జలాశయం కింద అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాల ఆయకట్టు వుంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఆశాజనకంగా వున్నాయి. పంట కాలువలకు సకాలంలో నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలో ప్రతి ఎకరాలో వరిసాగు చేపట్టారు. ఇదిలావుండగా గత ఐదేళ్ల నుంచి ప్రధాన కాలువల గేట్ల నిర్వహణను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. కాలువల్లో రెండే పూడిక తీయలేదు, తుప్పలు/నాచు తొలగించలేదు. పిల్ల కాలువలకు ఏర్పాటు చేసిన తలుపులు తుప్పుపట్టి పాడైపోయాయి. దీంతో పల్లంగా వున్న పొలాలకు నీటి అవసరం తీరిన తరువాత గేట్లు దించే పరిస్థితి లేకపోయింది. ఫలితంగా

... మిగతా 8వ పేజీలో



రామచంద్రపురం వద్ద పొట్ట దశకు వచ్చిన వరిపైరుకు నీరు అందక ఎదుగుదల లేని దృశ్యం

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పెరగాలి

- కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది

-8లో



రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

క్షతగాత్రుల స్వస్థలం ఖమ్మం



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు

అనకాపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆగి వున్న లారీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన వారు.

-8లో

రెండు కార్పొరేషన్లలో జిల్లా నుంచి ముగ్గురికి చోటు

అనకాపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో యాదవ, మాల కార్పొ రేషన్లలో జిల్లా నుంచి ముగ్గురికి చోటు లభించింది. యాదవ కార్పొరేషన్ సభ్యునిగా దూలి రంగనాయకులు (ఎలమంచిలి), మాల కార్పొరేషన్ సభ్యులుగా కొంద్రు మరిడయ్య (నర్సీపట్నం), సబ్బవరపు గణేశ్ నియమితులయ్యారు.

కాకరాపల్లిలో గ్రావెల్ దందా

కొండవాలు ప్రాంతంలో రాత్రిపూట తవ్వకాలు

- ఎస్ఈజెడ్‌తోపాటు రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలింపు
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

అచ్యుతాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): **అచ్యుతాపురం- మునగపాక మండలాల సరిహద్దులోని కాకరాపల్లి కొండవాలు ప్రాంతంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, టిప్పర్లతో తరలిస్తున్నారు.**

మునగపాక మండలం కాకరాపల్లి కొండవాలు ప్రాంతంలో భారీస్థాయిలో నాణ్యమైన గ్రావెల్ ఉంది. అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిలో నాగవరం జంక్షన్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. కొండవాలు ప్రాంతంలో అటవీ శాఖ గతంలో నీలగిరి మొక్కలు వేసింది. ప్రస్తుతం తోటలుగా ఏదిగాయి. గ్రావెల్ అక్రమ తవ్వకందారులకు ఇవన్నీ బాగా కలిసొచ్చాయి. పగటిపూట తవ్వకాలు జరిపితే అందరికీ తెలిసిపోతుందన్న ఉద్దేశంతో రాత్రి పది గంటల తరువాత గ్రావెల్ తవ్వకాలు మొదలుపెట్టి తెల్లవారుజామున నాలుగు గంటలకల్లా ముగిస్తున్నారు. తవ్విన గ్రావెల్‌ను టిప్పర్లలోకి లోడింగ్ చేసి సిరసపల్లి, నాగవరం మీదుగా గాజువాక-అచ్యుతాపురం ప్రధాన రహదారిలో నాగవరం జంక్షన్‌కు చేరుస్తున్నారు. ఇక్కడి నుంచి అచ్యుతాపురం జంక్షన్ మీదుగా సెజ్‌లో నిర్మాణంలో వున్న పలు కర్మాగారాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఇళ్ల నిర్మాణంలో పునాదులు కప్పడానికి విక్రయిస్తున్నారు.

కాగా కాకరాపల్లి కొండవాలు ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలపై మునగపాక మండల తహసీల్దార్ మహేశ్‌ను వివరణ కోరగా.. తమ మండలంలో గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, ఎవరైనా తవ్వినట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.



గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న కొండవాలు ప్రాంతం



కాకరాపల్లి కొండవద్ద గ్రావెల్ తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్



దిమిలి గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు

రాంబిల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధికారిణి శకుంతల, గ్రామ పెద్దలు అప్పారావు, సచివాయల సిబ్బంది ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

నత్తనడకన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే

- మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ శూన్యం
- పట్టించుకోని రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఉద్యోగులు

కోటవురట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటిని జియో ట్యాగింగ్ (మ్యాపింగ్) చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన హౌస్‌హోల్డ్ సర్వే మండలంలో నత్తనడకన సాగుతోంది. మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే సర్వేకు శాపంగా పరిణమించింది.

మండలంలో ఇంటింటా సర్వేను సచివాలయ ఉద్యోగులు మాత్రమే చేస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది అసలు పట్టించుకోవడం లేదు. వారు సర్వేపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ సర్వే కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో కుటుంబ వివరాలు పూర్తి నమోదు చేయాల్సి ఉంది. వేలిముద్ర వేసేందుకు ఇచ్చిన డివైజ్‌లు సరిగా పనిచేయడం లేదు. కొన్నిప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సమస్య తలెత్తుతున్నది. కుటుంబ సర్వేను ఆ సచివాలయంలో మిగిలిన ఉద్యోగులు చేయాల్సి రావడం వారికి భారంగా మారింది. గతంలో సచివాలయాల్లో వలంటీర్లు పనిచేసేవారు. వారు కుటుంబ మ్యాపింగ్ చేశారు. అయితే స్థానికంగా కుటుంబాలు లేకపోయినా వలంటీర్లు ఉన్నట్టు కుటుంబ మ్యాపింగ్ చేయడం ప్రస్తుతం సమస్యకు దారి తీసింది. గతంలో వలంటీర్లు ఉన్నప్పుడు 50 కుటుంబాలనే మ్యాపింగ్ చేశారు. ఇప్పుడు ఒక్కొక్కరు 500 కుటుంబాలకుపైగా సర్వే చేయాల్సి వస్తోందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సర్వేలో అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. మండలంలో 19,386 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా, ప్రస్తుతానికి 7,823 కుటుంబాలను మాత్రమే సర్వే చేశారు. మండలంలో 30శాతం మాత్రమే సర్వే చేశారు. ఈనెల 25వ తేదీ వరకు సర్వే గడువు పొడిగించారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కైలాసపట్నంలో హౌస్‌హోల్డ్ సర్వే చేస్తున్న దృశ్యం

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ కోరారు. మంగళవారం కర్రివానిపాలెంలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాదిలో రూ.14.79 కోట్లతో ఉపాధి పనులు చేశామన్నారు. అలాగే సిమెంట్ రోడ్లు, భవనాలకు సంబంధించిన మెటీరియల్‌కు రూ.కోటి ఐదు లక్షలు ఖర్చు చేశారన్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న కుటుంబాల్లో టెన్త్ ఫైబడి డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న యువతీ, యువకులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అలాగే 2025-26 ఏడాదిగాను ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి రూ. 62 కోట్ల లేబర్ బడ్జెట్‌గా గుర్తించామన్నారు. ఆయా పంచాయతీల ఆమోదం అనంతరం జిల్లా కలెక్టర్ వారి పరిపాలన నిమిత్తం సమర్పించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి హేమలత, ఉప సర్పంచ్ కర్రి నాగేశ్వరరావు, కార్యదర్శి ఎస్ రవీంద్రబాబు. కూటమి నాయకులు సూర్యనారాయణ, పోతు రంగారావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం: పీఆర్‌టీయూ

నక్కపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందుంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి. గోపీనాథ్ అన్నారు. మంగళవారం సాయంత్రం పీఆర్‌టీయూ తరపున ఉపాధ్యాయులకు లంచ్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల సమయపాలన మార్చాలనే ఆలోచన పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. 117 జీవో రద్దు కోసం పోరాడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు తోడపు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ప్రగడ శివాజీ, గౌరవాధ్యక్షుడు చోడిశెట్టి సత్యనారాయణ, కౌన్సిలర్లు డి. నాగాచారి, శ్రీధర్, సీహెచ్ ప్రసాద్, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు లంచ్ బ్యాగులను పంపిణీ చేస్తున్న గోపీనాథ్

మొబైల్ ఆధార్ క్యాంపులు ప్రారంభం



మొబైల్ ఆధార్ శిబిరాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఉదయం నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులను ప్రారంభించారు. నక్కపల్లి బీఆర్ అంబేడ్కర్ గురుకులంలోనూ, ఉపమాక సచివాలయం వద్ద ఆధార్ క్యాంపులను ఎంపీడీవో డి. సీతారామరాజు తనిఖీ చేశారు. ఆధార్ నమోదు, సవరణలు ఈ కేంద్రాల్లో జరుగుతాయని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచువాలని సూచించారు. ప్రజలు ఆధార్ కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఈ సేవలను పొందేలా మొబైల్ ఆధార్ శిబిరాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి సంకట హర చతుర్థి పూజలు

నక్కపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక విఘ్నేశ్వర ఆలయంలో మంగళవారం సంకట హర చతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయంలో వున్న స్వామి వారి ఉత్సమమూర్తికి ముందుగా వేదపండితులు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు, అప్పలాచార్యులు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం పట్టుపీతాంబరాలతో స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. అనేక మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



విఘ్నేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలతో అధిక ఆదాయం

కోటవురట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ పంటలో అంతర్ పంటలను సాగు చేస్తే అధిక ఆదాయం వస్తుందని పతాంజలి కంపెనీ సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కొడవటిపూడి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అంతర్ పంటలుగా అరటి, కోకో, పిప్పళ్లు వంటి వాటిని పండించవచ్చునన్నారు. అనంతరం ఆయిల్‌పామ్ ఆవశ్యకత, బిందుసేద్యం, మల్చింగ్, ఫెర్టిగేషన్ వంటి గురించి వివరించారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే మొక్కలు, ఎరువులు, యంత్రాపరికరాలు, రాయితీల గురించి వివరించారు. ఈ సదస్సులో సచివాలయ సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యుడు ప్రకాష్, సర్పంచ్ కోసూరి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



కొడవటిపూడిలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బీకే పల్లిలో పొలం పిలుస్తోంది



కొడవటిపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీ, ఏవో, రైతులు

కోటవురట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడపాలెం, చినబొడ్డేపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వ్యవసాయ అధికారిణి సరోజని మాట్లాడుతూ.. వరి పంటలో మానిపండు తెగులను గమనించడం జరిగిందన్నారు. నివారణకు ప్రోపికోనజోల్ లేదా అజక్సోస్ట్రోబిన్ టేబుకొనెజోల్ మందును పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే రెల్లరాల్చ గొంగలి పురుగు వరి పంటలో గింజ గట్టిపడే దశలో రాత్రి పూటే వెన్నులు కొరికి నష్టం కలుగజేస్తుందన్నారు. వీటి నివారణకు ఎకరాకు క్లోరట్రానిలిప్రోల్ (కోరాజెన్) 60ఎంఎల్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రానున్న రబీ సీజన్‌లో మినుములు, పెసలు విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అంటుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



డ్రైనేజీల్లో మందు మపిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

ఎలమంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 24వ తేదీన బండిమాంబ గ్రామ దేవత జాతరను పురస్కరించుకుని ఇప్పట్నుంచే డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి, బ్లీచింగ్, క్లోరినేషన్ వంటి పనులను చేపట్టారు. గ్రామ సెక్రటరీ ఎస్‌కేఎస్ ప్రసాద్ పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది వీధుల్లోని చెత్త నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాక బండిమాంబ జాతరకు వేలాది సంఖ్యలో భక్తులు, ప్రముఖులు హాజరు కానుండడంతో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

'శానిటేషన్ సిబ్బంది సేవలు శ్లాఘనీయం'



నక్కపల్లి సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సచివాలయాల్లో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, సచివాలయాల వద్ద సిబ్బంది మరుగుదొడ్ల దినాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ చేశారు. నక్కపల్లి సచివాలయంలో గ్రీన్ అంబాసిడర్లను ఎంపీడీవో సీతారామరాజు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బంది సేవలను శ్లాఘించారు. కార్యక్రమంలో సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి పనులు కల్పించాలి



ధర్మవరం అగ్రహారంలో జాతీయ గ్రామీణ ఉపాధి పనులు కల్పించాలని కోరుతున్న గ్రామస్థులు

ఎస్.రాయవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తమకు వెంటనే ఉపాధి హామీ పథకం ద్వారా కూలి పనులు కల్పించాలని ధర్మవరం అగ్రహారం కూలీలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేక కూలీలంతా ఖాళీగా ఉంటున్నారని, గతంలో చెరకు పంట ఉండేటప్పుడు ప్రతీ కూలీకి పని ఉండేదన్నారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శి స్పందించి కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి పనులు కల్పించాలని ఆయన కోరారు.

జగన్‌ని కలిసిన ఎంపీపీ బోదెపు

ఎలమంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువతో సత్కరించారు. నిత్యం ప్రజల మధ్యనే ఉండాలని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పోరాడాలని సూచించినట్టు బోదెపు తెలిపారు. ఎంపీపీ తన అనుచరులతో వెళ్లి కలిసినట్టు చెప్పారు.

అనుమతి లేకుండా భూముల సర్వే తగదు

గుర్రాజుపేటలో భూముల సర్వేను అడ్డుకున్న రైతులు

రైతులతో సమావేశమైన తహసీల్దార్ రమేష్‌బాబు



గుర్రాజుపేటలో తహసీల్దార్ రమేష్‌బాబును ప్రశ్నిస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజు

ఎస్.రాయవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ రెవెన్యూ పరిధి గుర్రాజుపేట గ్రామంలో నాలుగు రోజులుగా రెవెన్యూ అధికారులు భూములను సర్వే చేస్తున్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా భూముల సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బందిని సోమవారం రైతులు అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ జె.రమేష్‌బాబు మంగళవారం గ్రామంలోని రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ భూములను సర్వే చేయడం ఎందుకని ప్రశ్నించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో భూముల సర్వే చేస్తున్నామని, పరిశ్రమల కోసం కాదని, ఎటువంటి అపోహ పడవద్దని బదులిచ్చారు. దీంతో భూముల సర్వేపై అనుమానంగా ఉందని, తమకు ఇష్టం లేకుండా భూ సర్వే చేయొద్దని, సర్వే పనులు నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వారి భూములను ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ గ్రీన్ జోన్‌లో ఉన్న ఈ గ్రామంలో భూసేకరణ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఎక్కడ తమ భూములు పోతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారన్నారు. అనంతరం భూములు సర్వే చేయడానికి వీలులేదని రైతులు స్పష్టం చేయడంతో తహసీల్దార్ సంబంధిత అధికారులు అక్కడ నుంచి వెనుదిరిగారు.

ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నరసింహమూర్తి, సర్పంచ్ మురుకుర్తి రత్నం, ఉపసర్పంచ్ చంటిరాజు, కురందాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



పాయకరావుపేటలో ఝాన్సీలక్ష్మీభాయి, ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీభాయి చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళలు, పాఠశాలల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, ఎస్.సీతారామూర్తి, టి.వెంకటేశ్వరరావు, వై.అచ్యుతరావు, షేక్ సలీం, కె.సత్తిబాబు, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో.. స్థానిక శాఖా గ్రంథాలయంలో మహిళ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన ముగ్గుల పోటీలకు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు 32 మంది పాల్గొన్నారు. ఈ పోటీలు ఉపాధ్యాయులు, గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగాయి.

అచ్యుతాపురంలో.. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎం.రాధారమణి, ఎస్.కుసుమలను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి. కోటేశ్వరరావు. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం అధికారిణి శకుంతల, గ్రామ పెద్దలు అప్పారావు, సచివాయల సిబ్బంది ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులల్పించారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

మునగపాకలో.. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ.రమణ ఆధ్వర్యంలో ఇందిరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. మహిళా దినోత్సవంలో భాగంగా బాలికలకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. అదేవిధంగా మండలంలో గణపర్తి శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలోమహిళా దినోత్సవాన్ని నిర్వహించారు.



కోటవురట్ల గ్రంథాలయంలో వేసిన ముగ్గులను చూపిస్తున్న విద్యార్థినులు

గొడిచెర్లలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు



గొడిచెర్లలో సీసీ రోడ్ల పనులను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు వైబోయిన రమణ, నల్లల రత్నాజీ మాట్లాడుతూ గుంతలు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారులపై ప్రయాణం చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. కూటమి పాలనలో అన్ని రహదారులు అద్భుతంగా తయారవుతాయని చెప్పారు. కార్యక్రమంలో బోయిన సురేశ్, కొయ్య రాజబాబు, రామకృష్ణ, తూము శివ, నూకరాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నక్కపల్లి విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీదేవి

నక్కపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి అండర్ -19 హాకీ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి చెప్పారు. కాకినాడలో నిర్వహించిన అండర్-19 హాకీ పోటల్లో కళాశాలకు చెందిన పూజిత, సత్య విద్యార్థినులు బాలికల విభాగంలోనూ, మణికంఠ, అనిల్ బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. వచ్చే నెలలో రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఈ నలుగురు విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ కొలతలు పునఃపరిశీలన

మునగపాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు సంబంధించి కొలతలు పునః పరిశీలన జరుగుతోందని రెవెన్యూ అధికారులు తెలిపారు. విస్తరణకు సంబంధించి ఇదివరకే కొలతలు వేసిన విషయం అందరికి తెలిసిందేనని తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు తెలిపారు.

కొన్ని నెలలు క్రితం రోడ్డు వేయడంతో కొన్ని కొలతలు వాటిలో కలిసిపోయాయని, తిరిగి వాటిని గుర్తించే పనులు జోరుగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.



'రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'


గ్రామాల్లో రైతులకు వివరిస్తున్న ప్రజాసంఘ నేతలు

అచ్యుతాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు, కార్మికుల సమస్యలు కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పెదపాడులో వారు మాట్లాడుతూ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మికుల సమస్యలు పట్టడం లేదన్నారు. దీనిపై ఈనెల 26వ తేదీన అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రొంగలి రాము, కర్రి అప్పారావు, బ్రహ్మాజీ, జనపరెడ్డి సత్యనారాయణ, వరలక్ష్మి, సముద్రాలు తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన బోర్లు పునరుద్ధరణ

- వినియోగంలోకి తెచ్చిన మునిసిపల్ అధికారులు
- ఆంధ్రజ్యోతి ఎఫెక్టు


కొత్తపేట చినరామకోవెల వీధిలో పునరుద్ధరించిన చేతిబోరు

ఎలమంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో నిరుపయోగంగా ఉన్న చేతిబోర్లను మునిసిపల్ అధికారులు పునరుద్ధరించారు. ఈనెల 11వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'బోరుమంటున్నాయి' శీర్షిక ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించి చేతి బోర్లు పునరుద్ధరణ పనులు చేపట్టారు. పట్టణంలోని కొత్తపేట చినరామకోవెల వీధిలోని చేతిబోరు, మంత్రిపాలెం కాలనీలోని చేతిబోరుతో పాటు పట్టణంలోని మరో రెండు బోర్లను పునరుద్ధరించారు. రాజీవ్ గాంధీ క్రీడామైదానంలోని చేతిబోరు మరమ్మతులు చేపట్టేందుకు అవకాశం లేదని, నూతనంగా బోరు వేయాల్సిన అవసరం ఉందని మునిసిపల్ అధికారులు తెలిపారు. మరమ్మతుకు గురైన చేతిబోర్లను అధికారులు పునరుద్ధరించడంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.





కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసితులను ఆదుకోవాలి : సీపీఎం


కృష్ణంపాలెంలో మాట్లాడుతున్న దేముడునాయుడు

రాంబిల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసితులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నేతలు కృష్ణంపాలెం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దేముడు నాయుడు మాట్లాడుతూ ఎస్ఈజడ్ నిర్మాణం కోసం 2006లో రైతుల నుంచి భూములు, ఇళ్ళు తీసుకొని నేటికీ వారి సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. కృష్ణంపాలెంలో 300 రైతు కుటుంబాల వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించి, వారికి ప్యాకేజీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వాలకు తగదన్నారు. ఇప్పటికైన కలెక్టర్, ఎమ్మెల్యే వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, ఎస్ఈజడ్ నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.



పాలేశ్వర, భీమేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజ

మునగపాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీవీధిలో శతాబ్దాలు చరిత్ర కలిగిన పాలేశ్వర, భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన పూజ ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ ఆలయంలో లక్ష బిల్వార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో పూజను తిలకించేందుకు మహిళలు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

వరి పంటకు సుడిదోమ, మనిపండు తెగుళ్లు

మునగపాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు సుడిదోమ, మనిపండు తెగుళ్ల సోకుతున్నాయని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త భవాని వెల్లడించారు. మండలంలో నాగులాపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగుచేస్తున్న వరి పంటలను పరిశీలించారు. వాటిలో కొన్నింటికి సుడిదోమ, మనిపండు తెగుళ్ల సోకినట్టు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గుర్తించారు. నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి, వీఏఏ అనూష, రైతులు భీశెట్టి శేషు, గోవింద, రాము, పొలమరశెట్టి త్రినాథ్, చిన్న, బి.సోమశేఖర్ మళ్ల గోవింద పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

మునగపాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డులో మంగళవారం నాగులాపల్లి వద్ద విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో స్తంభం నేలకొరిగి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

జగన్ భరోసా కొండంత బలం : బొడ్డేడ ప్రసాద్

మునగపాక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసా కొండంత బలాన్ని ఇచ్చిందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మంగళవారం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బొడ్డేడ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న సమస్యలతోపాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిణామాలపై చర్చించినట్టు ప్రసాద్ చెప్పారు. ఆయన వెంట పలువురు వైసీపీ నేతలు ఉన్నారు.







ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి : తహసీల్దార్


ఏటికొప్పాకలో ర్యాలీలో పాల్గొన్న తహసీల్దారు వరహాలు, పంచాయతీ సిబ్బంది

ఎలమంచిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని తహసీల్దారు వరహాలు అన్నారు. మంగళవారం ఏటికొప్పాకలో ప్రపంచ టాయ్‌లెట్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. మరుగుదొడ్లను వినియోగించాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, సెక్రటరీ ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అన్నం బాబ్జీ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

ప్రపంచ టాయిలెట్ డే బ్రోచర్‌ని మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి, బహిరంగ మల విసర్జన లేకుండా చేయాలని అధికారులు కార్యదర్శులకు సూచించారు. డిసెంబరు పదో తేదీ నాటికి ప్రతీ పంచాయతీలోను బహిరంగ మల విసర్జన లేకుండా చూడాలని అధికారులు కార్యదర్శులకు తెలిపారు.

మునగపాకలో..

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, గంజాయి వంటి మాదకద్రవ్యాలు విక్రయాలు జరుపుతున్నట్టు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ఎస్.ఐ పి.ప్రసాదరావు పిలుపు నిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మరుగుదొడ్లు, చేతులు శుభ్రం అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ పలు సందర్భాల్లో మహిళలు పట్ల ఆకతాయిలు చెడుగా ప్రవర్తించిన వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించాలన్నారు. స్థానిక ఎంపీడీవో ఎం.ఉషారాణి మాట్లాడుతూ మరుగుదొడ్లు వాడకం, పరిసరాలు పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ఉండాలన్నారు. పంచాయతీ పాలకవర్గాలు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.









వరి పంటలో సుడిదోమ నివారణపై అవగాహన

కొత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో సుడిదోమ, రెల్లరాల్చు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. సీతానగరం గ్రామంలో హైదరాబాద్ మల్లారెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. సంప్రదాయ పద్ధతిలో వాటిని నివారించాలనే అంశాలను తెలియజేశారు.

సాగునీటి సంఘాలకు 4,500 మంది ఓటర్లు

కశింకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి సంఘాలకు 4500 మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కశింకోట పెద్దకాలువ, కాశీమదుం, ఉగ్గినపాలెం గ్రోయిన్, గొబ్బూరు, పరవాడపాలెం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న ఈ ఎన్నికల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి బాబా జయంతి

కశింకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అఫీషియల్ కాలనీలోని భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా మహా నారాయణ సేవా కార్యక్రమం (అన్న సమారాధన) నిర్వహించారు. అలాగే సాయంత్రం బాబాకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహా సన్నిధానం పూజ

- పోటెత్తిన భక్తులు

సబ్బవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువాడ గ్రామంలో అయ్యప్పస్వామి మహా సన్నిధానం పూజ అత్యంత వైభవంగా జరిగింది. తెలుగు యువత మండల అధ్యక్షుడు, అయ్యప్పస్వామి పీబీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పస్వామి 18 మెట్లతో కూడిన సెట్‌ను అద్భుతంగా నిర్మించారు. సన్నిధానం పూజలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది అయ్యప్ప భక్తులు తరలివచ్చారు. అయ్యప్పస్వామి నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. పలువురు నేతలు అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.

కొత్తపేట.. సమస్యల కోట!

మేజర్ పంచాయతీ తుమ్మపాల కొత్తపేటవీధిలో కనీస సదుపాయాలు కరువు



తుమ్మపాల మేజర్ పంచాయతీలోని కొత్తపేటవీధి వ్యూ

- గత ఐదేళ్లూ అభివృద్ధి శూన్యం
- అధ్వానంగా పారిశుధ్యం
- చుక్క నీరు రాల్చని కుళాయిలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

మేజరు పంచాయతీ తుమ్మపాల పరిధిలోని కొత్తపేటవీధి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ అన్ని ప్రాంతాల్లోనూ కనీస సదుపాయాలు కరువయ్యాయి. భారీగా చెత్తకుప్పలు, మురుగు నిల్వలు పేరుకుపోయాయి. పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కుళాయిలు ఉన్నా చుక్క నీరు కూడా రావడం లేదు. గత ఐదేళ్లూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలకు శాపంగా మారింది.





కాలువల్లో పేరుకుపోయిన మురుగునీటి నిల్వలు



కొత్తపేటవీధిలో నీరు రాని కుళాయి

తుమ్మపాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటవీధిలో దాదాపు 1500 కుటుంబాలకు చెందిన ఏడు వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీధిలోని ఏ మూలన చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. రోజుల తరబడి చెత్త నిల్వలు పేరుకుపోయి ఉండిపోతుండడంతో పందులు, కుక్కలు వాటిపై చేరి స్వైరవిహారం చేస్తూ రోత పుట్టిస్తున్నాయి. ఇళ్లల్లో వాడే వ్యర్థాలు ఈ చెత్త కుప్పల్లో రోజుల తరబడి నిల్వ ఉండిపోతుండడంతో కుక్కలు, పందులు పోట్లాడుకుంటూ అటుగా రాకపోకలు సాగిస్తున్న వారిపై దాడికి తెగబడుతున్నాయి. దీంతో వీధుల్లో రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. చెత్త కుప్పల నుంచి భయంకరమైన దుర్వాసనలు వెదజల్లుతుండడంతో ప్రజలు ముక్కు మూసుకుని మసలాల్సిన పరిస్థితి నెలకొంది.

రోజుల తరబడి మురుగు నిల్వలు

కొత్తపేటవీధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండిపోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వాడుకనీరు ముందుకు ప్రవహించే అవకాశం లేక మురుగు రోడ్ల పైనే పరుగులు తీస్తోంది. దీంతో వీధుల్లో నివాసం ఉండేవారు, రాకపోకలు సాగించేవారు మురుగునీటిలోనే సంచరించాల్సిన దుస్థితి దాపురించింది. దీనికితోడు మురుగు నిల్వల్లో విషపూరితమైన దోమలు ప్రబలి గ్రామస్థుల పై దాడికి తెగబడుతున్నాయి. రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పలువురు దోమల బారిన పడి జ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. పంచాయతీ సిబ్బంది కనీసం బ్లీచింగ్ కూడా చల్లకుండా కాలయాపన చేస్తుండడంతో పలువురు మంచి పడుతున్నారు.

చుక్కనీరు రాల్చని కుళాయిలు

కొత్తపేటవీధిలో ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో ఉన్న కుళాయిల నుంచి చుక్కనీరు కూడా రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. పక్క వీధుల్లోకి వెళ్లి తాగునీరు, వాడుకనీరు తెచ్చుకోవాల్సిన దుస్థి తి దాపురించింది. దాదాపు పది పదిహేనేళ్ల క్రితం వేసిన తాగునీటి కుళాయిల పైపులైన్లు ఎక్కడికక్కడ మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరా ఆగిపోయింది. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతంగా మారాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొత్తపేట వీధి ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. గతంలో మంత్రిగా ఉన్న అమర్‌నాథ్ కొత్తపేట వీధిని పరిశీలించి నిధులు మంజూరు చేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తానని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా కొత్తపేటవీధి సమస్యలపై దృష్టిసారించాలని స్థానికులు కోరుకుంటున్నారు.



చెత్తాచెదారాలతో నిండిపోయిన రహదారి

పంచాయతీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



కొత్తపేటవీధి సమస్యలపై పలు సందర్భాల్లో పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదు. స్థానికంగా ఉండే ప్రజలు ఎన్ని అవస్థలు పడినా పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మా వీధికి వచ్చిన నాయకులు, అధికారుల ముందు సమస్యలు ఉంచినప్పటికీ నేటికి పరిష్కారం కాలేదు. పన్నులు వసూళ్లు చేస్తున్నా అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

-కోసూరి బోగి, కొత్తపేటవీధి

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం



కొత్తపేటవీధిలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కడికక్క చెత్తాచెదారాలు, మురుగు నిల్వలు నెలలు తరబడి ఉండిపోతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మనస్ఫూర్తిగా ఇంటిల్లిపాది కూర్చొని భోజనం చేసే పరిస్థితి లేదు. భయంకరమైన దుర్వాసనలతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. ఈ సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి.

-కోసూరి ఈశ్వరమ్మ, కొత్తపేటవీధి

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



కొత్తపేటవీధిలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఎక్కడికక్కడ తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో చాలా వరకు కుళాయిల నుంచి మంచినీరు రావడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నాం.తాగునీటి సమస్యను పలు సందర్భాల్లో పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- చుక్కా రామలక్ష్మి, కొత్తపేట

నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తాం..



కొత్తపేటవీధిలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నెల రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపడతాం. పంచాయతీలో నిధుల కొరత కారణంగా శతశాతం పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులు చేయించలేకపోతున్నాం. ఉన్నతాధికారుల సూచనలు మేరకు శతశాతం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఇప్పటికే పలు సందర్భాల్లో నా సొంత నిధులతో పారిశుధ్య పనులు చేపట్టాను. అయినా పూర్తి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. అన్నింటిపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

- మళ్ల సత్యప్రసాద్, ఈవో, తుమ్మపాల పంచాయతీ



దీపారాధన ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ

మొగలిపురంలో ఘనంగా దీపారాధన

సబ్బవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మొగలిపురం గ్రామంలో దీపారాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ మహా శివుడికి పూజలు చేసి దీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తుల శివనామ స్మరణతో గ్రామం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు తమరాన సన్యాసమ్మ, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు చైర్‌గేమ్స్



చైర్‌చైర్ గేమ్స్‌లో పాల్గొన్న విద్యార్థినులు

కశింకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కశింకోట శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థినులకు చైర్ గేమ్స్ నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీ.రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ ఎం.మహాలక్ష్మి, గ్రామీణ వికాస బ్యాంకు బ్రాంచి మేనేజర్ కె.కవిత, న్యూఢిల్లీ గ్రంథాలయాల కార్యదర్శి గురుదేవ్‌జీ, కశింకోట గ్రంథాలయాధికారి కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో అనకాపల్లి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కథా రచయిత, సంస్థ కన్వీనర్ గొంతిన రంగబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇ.చక్రపాణి మాట్లాడుతూ ఇటీవల సాహితీ మిత్రులు సాధించిన విజయాలకు అభినందనలు తెలిపారు. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు వారోత్సవాల నివేదికను అందజేశారు. ప్రముఖ రచయిత్రి పి.అమరజ్యోతి కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు కవులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అతిథులు ఎం.రామారావు, బల్లా నాగభూషణం, కవులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

స్వామిని దర్శించుకున్న టీడీపీ నేతలు.. భారీ అన్నసమారాధన



స్వామిని దర్శించుకుంటున్న తాతయ్యబాబు, కుమార్, బుద్ద, సురేంద్ర తదితరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం పరమేశ్వరి పార్కు జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఏకాహం నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని పూలమాలలతో అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు. స్వామివారిని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఆలయ ట్రస్టీ పొలిమేర నాయుడు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధనను టీడీపీ నాయకులు ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

స్వచ్ఛభారత్ సాకారానికి మురుగుదొడ్లు నిర్మించుకోండి

- ఎంపీపీ బోకం సూర్యకుమారి



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, తదితరులు

సబ్బవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ సాకారానికి ప్రతీ కుటుంబం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మరుగుదొడ్లు లేని కుటుంబాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ దరఖాస్తులు చేసిన అందరికీ మరుగుదొడ్లు మంజూరు చేస్తామని చెప్పారు. స్వచ్ఛ గ్రామాల సాకారానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పలువురు పారిశుధ్య కార్మికులను ఎంపీపీ, ఎంపీడీవో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి రామారావు, సర్పంచ్ బోను గంగునాయుడు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారుల మరమ్మతులు

- పట్టణంలో శరవేగంగా గుంతలు పూడ్చివేత
- త్వరలో రెండు కల్వర్టుల అభివృద్ధి పనులు ప్రారంభం



నర్సీపట్నం-చింతపల్లి రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్న దృశ్యం

నర్సీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రహదారుల మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లపై పెద్ద గుంతలు పడి ప్రయాణం నరక ప్రాయంగా మారింది. వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరిగేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతలు లేని రోడ్లు లక్ష్యంగా మరమ్మతు పనులు మొదలుపెట్టింది. ప్రస్తుతం నియోజవర్గంలో రూ.41 లక్షలతో 19 రోడ్ల పనులు చేపడుతున్నారు. రెండో విడత ఆరు వర్కులకు రూ.43 లక్షలు, మూడో విడత మరో ఆరు వర్కులకు రూ.109 లక్షలు మంజూరఅయ్యాయి. ఈ పనులకు టెండర్లు పూర్తి చేశారు. శివపురం డీఎఫ్‌వో కార్యాలయం రోడ్డు కల్వర్టు అభివృద్ధికి రూ.15 లక్షలు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి సమీపంలోని కల్వర్టు నిర్మాణానికి రూ.55 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు కల్వర్టు పనులకు టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో పనులు మొదలు పెడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు.

అలాగే నర్సీపట్నం- దేవీపట్నం రోడ్డులో రూ.10 లక్షలతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి సమీపంలోని గుంతలు పూడ్చి తారు పోశారు. నర్సీపట్నం ఎక్సైజ్ కార్యాలయం దాటిన తర్వాత రూ.4 లక్షలతో మరమ్మతు పనులు పూర్తి చేశారు. పెదబొడ్డేపల్లి నుంచి నర్సీపట్నం అబీద్ సెంటర్ వరకు రూ.10 లక్షలతో రోడ్డు గుంతలు పూడ్చివేత పనులు చేపట్టారు. నర్సీపట్నం లారీ యార్డు నుంచి బలిఘట్టం, బయపురెడ్డిపాలెం వరకు రూ.10 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించారు.. గొలుగొండ మండలం కసిమిలో రెండు వర్కులకు రూ.7 లక్షలు, నాతవరం పీహెచ్‌సీ వద్ద రోడ్డు మరమ్మతు పనులకు రూ.10 లక్షలతో చురుగ్గా చేపడుతున్నారు. మాకవరపాలెం మండలంలో కొండల అగ్రహారం నుంచి రోలుగుంటకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు రూ.6 లక్షలు మంజూరయ్యాయి.

సామాన్యులకు అండగా టీడీపీ

- పార్టీ యువనేత సకురు కోటేశ్వరరావు

చోడవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాన్యుల సంక్షేమం కోసం ఉద్భవించింది తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ యువనాయకుడు సకురు కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, నాయకులు బొబ్బిలి ప్రసాద్, కుమార్, శివ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళులు



నెహ్రూచౌక్‌లో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. నెహ్రూచౌక్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ ప్రధానిగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జి మలపురెడ్డి కోటేశ్వరరావు, నాయకులు కె.సత్యనారాయణ, బి.భానుమూర్తియాదవ్, టి.రమణ, ఎస్.రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు భక్తి గీతాల పోటీలు

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శాఖా గ్రంథాలయంలో దివ్యాంగులకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. అంతకుముందు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, దివంగత ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ

కొత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వెంకుపాలెం గ్రామంలో ఉన్న హృదయ శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధులను అన్ని వర్గాల వారు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాడి వెంకట్రావు, సభ్యులు సత్యనారాయణ, విజయ్‌కుమార్, దేవుడునాయుడు, గణేష్, అజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

కశింకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కశింకోట సత్తెమ్మతల్లి కాలనీ వద్ద ఉన్న ఏలేరు కాలువ సమీపంలో పేకాట స్థావరంపై మంగళవారం దాడి చేశామని ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరంపై దాడి చేయగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారని చెప్పారు. వీరంతా సత్తెమ్మతల్లి కాలనీకి చెందినవారుగా గుర్తించామన్నారు. వీరి నుంచి రూ.80,130 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ చెప్పారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలకండి: ఏఈ షణ్ముఖ



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పరవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలకాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి.షణ్ముఖ పిలుపునిచ్చారు. వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకొని పరవాడ సంతబయలు వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, పాఠశాల హెచ్‌ఎం బి.అప్పలనాయుడు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రెక్కరాల్చు పురుగు నివారణకు చర్యలు

చోడవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరిలో రెక్కరాల్చు పురుగు ఉధృతి నివారణకు చర్యలు చేపట్టాలని ఏవో పావని సూచించారు. తిమ్మనపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ తెగులు ఉధృతి తగ్గించేందుకు క్లోరిఫైరిఫాస్ 2.5 ఎంఎల్ మందు లేదా, మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాల్సిందే..

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండాల్సిందేనని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పష్టం చేశారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం, చేతులు శుభ్రం చేసుకునేందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మల విసర్జన సామాజిక దురాచారమని చెప్పారు. పర్యావరణం, ఆరోగ్యాన్ని కాపాడేందుకు దీన్ని నివారించాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన, అపరిశుభ్ర వాతావరణం వల్ల నీరు కలుషితమై డయేరియా వంటి వ్యాధులు ప్రబలి ఆరోగ్యం దెబ్బతింటున్నదని ఆమె తెలిపారు. దీంతో వైద్య సేవల కోసం డబ్బు ఖర్చు పెడుతున్నామన్నారు. ఒక్కసారి ఆరోగ్యం దెబ్బతింటే అది వ్యక్తి ఉత్పాదకతను తగ్గిస్తుందని, కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం కూడా ముఖ్యమన్నారు. మరుగుదొడ్డి వినియోగించిన వెంటనే చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు భోజన సమయంలో చేతులు కడుగుకొనేలా చర్యలు తీసుకోవాలని, వారికి చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. మరుగుదొడ్లను సామాజిక గౌరవం కోసం ఉపయోగించాలన్నారు. ఆడపిల్లలు, మహిళలు మరుగుదొడ్లను ఉపయోగించడం సురక్షితమని ఆమె తెలిపారు. కొత్త మరుగుదొడ్ల మంజూరుకు, సామూహిక మరుగుదొడ్లకు రిపేర్లు, వినియోగానికి చర్యలు గ్రామీణ నీటి సరఫరా విభాగం బాధ్యత తీసుకుంటుందన్నారు. చేతులు కడుక్కోవడాన్ని క్రమం తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ చేపట్టాలి

వ్యవసాయ శాఖ మంత్రిని లేఖలో కోరిన లోకనాథం

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి పాల రైతుల ఆస్తులను కాపాడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడును మంగళవారం ఓ లేఖలో కోరినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. పాడి రైతులకు తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే పునరుద్ధరించాలని, దీనిపై అసెంబ్లీలో చర్చించి రైతులకు న్యాయం చేయాలని కోరానన్నారు. పాడి రైతుల ఆస్తులను పరిరక్షించాల్సిన విశాఖ డెయిరీ పాలకవర్గం సొంత ఆస్తులను కూడబెట్టుకోవడానికి తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సీబీఐతో విచారణ జరిపించేలా తగిన చొరవ తీసుకోవాలని మంత్రిని కోరినట్టు లోకనాథం తెలిపారు.

'పాత పెన్షన్ సాధనకు చలో విజయవాడ'

పరవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ సాధన కోసం డిసెంబరు 10న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.త్రినాథస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు లంకెలపాలెం హైస్కూల్‌లో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎన్‌వీఆర్ మూర్తి, అమ్మినాయుడు, యూటీఎఫ్ నాయకులు జాకీర్ ఆలీ, డి.శ్రీనివాస్, శివాజీ, భారతి, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

భోగలింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాలు


ఆలయ మండపంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట మీద గల భోగలింగేశ్వరుని ఆలయంలో మంగళవారం సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు పేరూరి సూర్యనారాయణ పర్యవేక్షణలో చిన్నిస్వామి, సాత్విక్, శ్రీరామ్ సహకారంతో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణతో పాటు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఛైర్మన్ సత్యనారాయణను టీడీపీ నేతలు బుద్ద నాగజగదీశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు, పీవీజీ కుమార్, కొణతాల వెంకటరావు సత్కరించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

సబ్బవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సూచించారు. స్థానిక గ్రంథాలయాలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రమం తప్పకుండా విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం చేయాలని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను గ్రంథాలయాధికారి శిరీషా సత్కరించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు పి.ప్రసాద్, పిసూర్యశ్రీ పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం: ఎంపీపీ సూరిబాబు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

తుమ్మపాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ గొర్లి సూరిబాబు పేర్కొన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశుభ్రత విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 19 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎంపీడీవో నరసింహరావు మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త మరుగుదొడ్లు మంజూరైన వారికి పత్రాలు అందజేసి పనులను ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, అంగన్‌వాడీల సమన్వయంతో ఈ కార్యక్రమం ముందుకు సాగాలన్నారు. అనంతరం పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేవీవీ.ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న సురేష్‌బాబు, ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంజాయి, మాదక ద్రవ్యాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను దుర్భరం చేసుకోవడం విచారకరమన్నారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచేలా చూడాలని కోరారు. హెచ్‌ఎం ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కాళ్ల శివశంకర్, కిరణ్మయి, ప్రసాద్, రాణి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన అవసరం


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న డీపీవో శిరీషారాణి

తుమ్మపాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీవో శిరీషారాణి సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా రేబాక, తుమ్మపాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమెమాట్లాడారు. పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఇంటి పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రామస్వామి, ఎంపీడీవో నరసింహరావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, నాగలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బయ్యవరంలో పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

కశింకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామ సచివాలయంలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి వెంకటలక్ష్మీ పాల్గొని మాట్లాడారు. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి బాబూరావు కార్మికులను శాలువాతో సత్కరించారు. ఏఎన్ఎం శివకుమారి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో ఇందిరాగాంధీ జయంతి

కొత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో భారతరత్న ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు ఇందిరాగాంధీ జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థినులు ఇందిరా గాంధీలా ధీరవనితలుగా పేరు ప్రఖ్యాతలు పొందాలని ఆకాంక్షించారు. సూపరింటెండెంట్ పి.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, విమెన్ ఎంపవర్‌మెంటు కన్వీనర్ సామ్రాజ్యం, ఎన్ఎస్ఎస్ పీవోలు ఎ.సూరిబాబు, బీఎంవీపీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

అనకాపల్లి టౌన్: గవరపాలెం దిబ్బవీధి నాగేంద్రుని ఆలయం వద్ద మంగళవారం పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. గవరపాలేనికి చెందిన కొణతాల గణేష్ కుటుంబీకులు ఈ కార్యక్రమం చేపట్టారు.

జీసీసీ దశ మారేనా?

- డీఆర్ డిపోలకు భవనాలు కరువు
- సంతల్లో దళారుల చేతుల్లో గిరిజనులు దోపిడీ
- నూతన జీసీసీ చైర్మన్ శ్రావణ్‌పైనే ఆశలు

అనంతగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మన్యంలోని గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీచేసే.. డీఆర్ డిపోలకు భవనాలు కరువయ్యాయి.. ఉన్నవాటి లోనూ కనీస సౌకర్యాలు కొరవడడంతో నిర్వహణ భారంగా భారంగా మారిందని సెల్స్‌మేన్లు వాపోతున్నారు. దశాబ్దాల నాటి భవనాల కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా సరుకులు తడిసిపోతున్నాయి.. వీటిలోనే ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఏ సమయంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉన్న డీఆర్‌డీపోలపైనా గత వైసీపీ ప్రభుత్వం కనీస దృష్టిసారించలేదు.ఈ స్థితిలో విశాఖ గిరిజన సహకార సంస్థ కార్యాలయంలో సోమవారం జీసీసీ చైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్ బాధ్యతలను స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆయనపై జీసీసీ బలోపేతం, డీఆర్ డిపోల అభివృద్ధిపై గిరిజనులు ఆశగా ఎదురుస్తున్నారు.

వర్షం పడితే తడిసి ముద్దవుతున్న సరుకులు

.24 పంచాయతీల్లో 16 మెయిన్ డీఆర్‌డిపోలు, 26 సబ్ డిపోలున్నాయి.. 14,716 రేషన్‌కార్డులదారులకు ప్రతినెలా సరుకులను అందజేస్తున్నారు.. అయితే, దాదాపుగా 10 మెయిన్ డిపోలకు పైగా భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కిటికీలు, తలుపులు, పైకప్పు రేకులు రంధ్రాల పడివర్షాలకు నిత్యావసర సరుకులు బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమపిండి,వంట నూనెలు, సబ్బులు, తదితర వస్తువులు ముద్దవుతున్నాయి. దీంతో నిర్వహకులపై భారం పడుతోంది.

అనంతగిరిలో.. ఎంఎఫ్‌పీ గొడౌన్ నిల్

మండలంలోని అనంతగిరి, కాశీపట్నం, డముకు, గుమ్మకోట గిరిజనులకు ప్రధాన వారపు సంతలు.. గిరిజనులు అడవుల్లో సేకరించిన అటవీ ఉత్పత్తులను, ఆయా స్టాండింగ్ పాయింట్ వద్ద జీసీసీ కొనుగోలు చేస్తోంది.. అయితే, అటవీ ఉత్పత్తుల నిల్వకు మండలంలోని ఎంఎఫ్‌పీ గొడౌన్ నిర్మాణంపై జీసీసీ దృష్టిపెట్టలేదు.. గతంలోని ఎస్.కోటలోని గొడౌన్ వినియోగించేవారు. అది కాస్తా శిథిలావస్థకు చేరడంతో సుంకరమెట్ట ఎంఎఫ్‌పీ గొడౌన్‌లో అటవీ ఉత్పత్తులను నిల్వ ఉంచుతున్నారు.

దళారుదే పైచేయి..

గిరిజనులు అటవీ ఉత్పత్తులపైనే ఆధారపడి జీవిస్తుంటారు.. ఈస్థితిలోదళారులనుంచి గిరిజనుల పరిరక్షణకు జీసీసీ సంస్థ ఏర్పాటైంది. అయితే, అడవుల్లో సేకరించి అటవీ ఉత్పత్తులను కొనుగోలులో జీసీసీ కొంతమేర విఫలమవుతోందని విమర్శలున్నాయి. సుమారు ఐదేళ్లక్రితం వరకు గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులు జీసీసీకే


డముకు సంతలో దినుసులు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

అనంతగిరిలో డీఆర్ డీపో


విక్రయించాలనే


వర్షాలకు గోడకూలిపోయిన గుమ్మకోట డీఆర్ డిపో వెనక భాగం

నిబంధన ఉండేది.. ఉత్పత్తుల కొనుగోలులో జీసీసీ వెనుకబడడంతో దళారీ వ్యవస్థ పుంజుకుంది.. అనంతగిరి, డముకు, కాశీపట్నం, గుమ్మకోట ప్రధాన వారపు సంతల్లో దళారులు సిండికేట్‌గా మారి, గిరిజనులు సేకరించి, చింతపండు, అల్లం, తేనె, తదితర అటవీ ఉత్పత్తులను వారికి నచ్చి ధరకే కొనుగోలుచేస్తూ.. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో గిరిజనులు నష్టపోతున్నారు. ఈ సమస్యలపై నూతన చైర్మన్ శ్రావణ్‌కుమార్ ఏ మేరకు దృష్టిసారిస్తారో వేచి చూడాలి.

గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి: సీఐ


మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

సీలేరు, నవంబరు 19 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి పరిధిలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేకదృష్టి సారించినట్టు సీఐ వి. వరప్రసాద్ అన్నారు. గూడెంకొత్తవీధి సీఐగా బాధ్యతలను చేపట్టినఆయన మంగళ వారం తొలిసారిగా సీలేరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్య ల్లో గంజాయి అతి ముఖ్యమైనందని, ఈ వ్యసనంతో యువత జీవితాలు నాశనమవుతున్నాయన్నారు.నేరాల సంఖ్యనుతగ్గించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తం

చింతపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఏపీఆర్ కళాశాలలో విద్యార్థులతో ఎస్సై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్‌కి దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరితోనూ పంచుకోరాదన్నారు. ప్రిన్సిపాల్ రామేశ్వరం పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం


ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

చింతపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరా ప్రియదర్శిని గాంధీ సేవలు చిరస్మరణీయమని ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్టీ సెల్ చైర్మన్ రీమల నవభారత్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ నాయకులు ఇంది రాగాంధీ జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉల్లి సత్యనారాయణ, వంతలబాబూరావు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ పది, ఇంటర్ ఫీజు గడువు పెంపు

అరకులోయ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌స్కూల్ కు సంబంధించి పదవతరగతి, ఇంటర్‌ల పరీక్షలఫీజు చెల్లించే గడువు ప్రభుత్వం పెంచిననట్టు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో ప్రవేశాలకు వీలు కల్పిస్తూ తాత్కాల్ పద్ధతిలో ఫీజును ఈ నెల 17 వతేదీ నుంచి 25 వ తేదీ వరకు గడువు పెంచినట్టు చెప్పారు. వివరాలకు ఫోన్! 63032 26170 సంప్రదించాలని పేర్కొన్నారు.

కాఫీ రైతులకు అవగాహన

సీలేరు, నవంబరు 19 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ఎ ధారకొండ పంచాయతీ పెబ్బంపల్లిలో మంగళవారం కాఫీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ ముర్ల సత్యవతి, ఉప సర్పంచ్ ముర్ల చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌సీ చిన్నారావు పాల్గొని మాట్లాడారు. కాఫీ రైతులు దళారుల చేతిలో మోస పోకుండా జీసీసీ, ఐటీడీ సంయుక్తంగా కాఫీ పండ్లు చెర్రీ, , పార్చిమెంట్ కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. టీడీఏ మ్యాక్స్ కాఫీ పండ్లు రూ. 44, జీసీసీ చెర్రీ రూ. 150, పార్చిమెంట్ రూ. 285 ధర నిర్ణయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక లైజాన్ వర్కర్ లక్ష్మణరావు తదితరులు ల్గొన్నారు.

నాలుగో రోజుకు గురుకుల ఉపాధ్యాయుల దీక్షలు

పాడేరురూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో అ వుట్ సోర్సింగ్ విధానంలో చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉద్యోగులు (సీఆర్టీలు)గా మార్చు చేయాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ ఎదుట వారు చేపట్టిన నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. మంగళవారం ఈ శిబిరాన్ని డీసీసీ అధ్యక్షుడు సతక బుల్లిబాబు సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న గురుకుల విద్యా సంస్థల్లో ఎక్కడా లేని అవుట్ సోర్సింగ్ విధానం మన వద్ద మాత్రమే ఉండటం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పం దించి గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులను సీఆర్టీలుగా మార్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో గిరిజన గురుకులాల్లో ప్రస్తుతం అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 1,143 పోస్టులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసే అటెండర్‌కు ఇచ్చే వేతనాన్ని కూడా గిరిజన గురుకులాల్లోని ఉపాధ్యాయులకు లభించకపోవడం విచారకరమన్నారు. ఈ నేపథ్యంలో వారికి న్యాయం చేయాలని



ఉద్యోగుల శిబిరంలో కూర్చున్న డీసీసీ అధ్యక్షుడు బుల్లిబాబు

డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.కృష్ణారావు, ఎస్.సుబ్ర హ్మణ్యం, క్రిష్ణవేణి, కె.సింహాచలం, పి.నవీన్, బి.రాంబాబు, ఏపీ. గిరిజన సంక్షేమ గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.కొండబాబు, ఎన్.వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.

రెల్ల రాల్చే పురుగు నివారణకు సస్యరక్షణ తప్పనిసరి


వరిలో తెగుళ్లు పరిశీలిస్తున్న ఏవో

కొయ్యూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో రెల్ల రాల్చే పురుగు నియం త్రణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖాధికారి ఉమాదేవి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలో మంప శివారు గంగవరం, కొయ్యూరులలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏవో వరిలో రెల్లరాల్చే పురుగు ఉధృతిని గుర్తించారు. ఈ సందర్భంగా ఈతెగులు నివారణకు ఎకరానికి 400 మిలీలీటర్ల చొప్పున మోనోక్రోటోపాస్, లేదా ప్రోపనోపాస్ పిచికారీ చేయాలన్నారు. దీనికి ముందు పొలానికి తడి పెట్టాలని, దీని వల్ల పెద్ద పురుగులు బయటకు వస్తాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులతో పాటు రైతు సేవా కేంద్రం సిబ్బంది వీహెచ్‌ఏ ప్రభాకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రూప తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ


వరిలో తెగుళ్లు పరిశీలిస్తున్న ఏవో

అనంతగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో ఏవీవీ కుమార్ తనిఖీ చేశారు. లబ్ధిదారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ ప్రత్యేక శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కొత్త ఆధార్‌కార్డులు, పేర్లు చేర్పుమార్పులు, బయోమెట్రిక్ స మస్య, అప్‌డేట్ తదితర సేవలు అందుబాటులోఉన్నట్టు వివరించారు. ఈ కార్యక్ర మంలో సచివాలయడిజిటల్ అసిస్టెంట్ గీత, ఆధార్ కేంద్రం నిర్వాహకుడు శేఖర్ పా ల్గొన్నారు.

పశువుల సంరక్షణపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న పశువైద్యాధికారి సౌజన్య

ముంచంగిపుట్టు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):పశువుల సంరక్షణపై గిరి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని పశువైద్యాధికారి ఎం. సౌజన్య సూచించారు. మండలంలోని వనుగుమ్మ, సంగడ పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో మంగళవారం పశుసంవర్థక, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా నట్టల నివారణ టీకాలు వేయాలని, ప్లాస్టిక్ పదార్థాలు తినకుండా తగు జాగ్రత్త వహించాలన్నారు. పచ్చగడ్డినే మేతగా వేయాలన్నారు. అలాగే మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస బాబు మాట్లాడుతూ.. సాగులో చిన్నపాటి మెలుకవలు పాటిస్తే పంట దిగుబడి అధికంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు త్రినాథ్, మిల్కి, ఆయా శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా కరుణ



చింతపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా జి.కరుణ నియమితులయ్యారు. తాజా బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న జీఆర్‌హెచ్ రాజుని అనంతగిరి బదిలీ చేశారు. ఆ యన స్థానంలో నాతవరం మండలంలో ఏఈఈగా పనిచేస్తున్న కరుణను పదోన్నతి పై ఇక్కడ నియమించారు. ఈమేరకు ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.


చింతపల్లిలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, నేతలు


దుంబ్రిగుడలో మరుగుదొడ్డి మంజూరు ధ్రువ పత్రమిస్తున్న ఎంపిడీవో


కొయ్యూరులో ర్యాలీ

బహిరంగ మల విసర్జనకు దూరంగా ఉండాలి

- వరల్డ్ టాయిలెట్స్ డే ర్యాలీలు

కొయ్యూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనం సాగాలంటే ఆరుబయిట మల విసర్జనకు స్వస్తి పలకాలని ఎంపీడీవో ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో వరల్డ్ టాయిలెట్ డే పురస్కరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ఆరు బయట మల విసర్జనతో కలరా, టైఫాయిడ్, మలేరియా కారక దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పారిశుద్ధ్యం క్షీణించి అంటురోగాలు ప్రబలే అవకాశాలున్నందున ఆరు బయిట మల విసర్జనకు దూరంగా ఉండాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి మండల కేంద్రంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టారు.. ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ గంగరాజు, ఎంపీడీవో ఏవీవీ.కుమార్ ర్యాలీలో పాల్గొన్నారు. మన ఆరోగ్యం మనచేతుల్లో ఉందంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.

గూడెంకొత్తవీధిలో..

గూడెంకొత్తవీధి: గిరిజనులు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలని స్థానిక ఈవోఆర్‌డీ పాపారావు తెలిపారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్లు దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్, హౌసింగ్ ఏఈ సూరిబాబు పాల్గొన్నారు.

పెదబయలులో..

పెదబయలు: పెదబయలులో ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి


జీకే వీధి మండల కేంద్రంలో నినాదాలు చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

అర్హత పొందిన లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఎంఈవో పుష్పజోసెఫ్, మండల పరిషత్ అధ్యక్షురాలు వరహాలమ్మ,ఉపాధ్యక్షులు రాజుబాబు, ప్రాదేశిక సభ్యులు బొంజుబాబు, ఏపీఎం దేవ మంగ, వైద్యాధికారులు నిఖిల్, చైతన్య, పంచాయితీ కార్యదర్శులు తదితులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి కలిగి ఉండాలని స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం పురస్కరించుకుని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చింతపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. మరుగుదొడ్లు మంజూరైన 142మందికి పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కరుణ, ఏఈఈ కల్యాణ్‌రామ్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు తృతీయ స్థానం


బహుమతి పొందిన సెయింట్‌ఆన్స్ విద్యార్థులతో నిర్వాహకులు

పెదబయలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని సెయింట్‌ఆన్స్ పాఠశాలలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పెదబయలు సెయింట్‌ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మలా ఆన్, కరస్పాండెంట్ సిస్టర్ థెరెస్, వైస్ ప్రిన్సిపాల్ స్టాజీ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 12 సెయింట్ ఆన్స్ పాఠశాలల పిల్లలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొగా, తమ పాఠశాలకు తృతీయ స్థానం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుల రూప కల్పనలో సహకరించిన సైన్స్ ఉపాధ్యాయులు శివ,మధు మురళి, కేశవరావు, విద్యార్థులను సహ ఉపాధ్యాయులు అభినందించారు.

రాములు రహదారికి మరమ్మతులు చేపట్టాలి


ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

ముంచంగిపుట్టు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ రాములు గ్రామ ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను డిమాండ్‌చేశారు. ఈ ప్రాంత గిరిజనులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం శ్రీను మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి దారాపల్లి మీదుగా రాములు, గడ్డిబంద గ్రామాల వైపు ఉన్న సుమారు నాలుగు కిలోమీటర్ల పీఆర్ రహదారి రూపుమారిపోయిందని తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ గోతులు, రాళ్లు తేలి వాహన రాకపోకలకు గిరిజనులు ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రం వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారన్నారన్నారు. కొన్ని సందర్భాల్లో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం కానరావడంలేదని వాపోయారు.

చీకుమదులకు ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ కొండలరావు, తదితరులు

హుకుంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల చీకుమదుల గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును స్థానిక వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు మంగళవారం ప్రారంభించారు. ప్రతి రోజూ పాడేరు నుంచిహుకుంపేట చేరుకుని అక్కడి నుంచి చీకుమదులకుఈ సర్వీసు నడవనున్నట్టు ఆయన తెలిపారు. ఈ బస్సు ద్వారా మండలంలో గన్నేరుపుట్టు, బాకూరు, మెరకచింత. చీకుమదుల, జర్రకొండ పంచాయతీల పరిధిలోని మారుమూల గ్రామాలకు రవాణా సదుపాయం కలుగుతుందని పేర్కొన్నారు. అయితే వారపు సంతలు జరిగే రోజుల్లో మాత్రం అదనపు ట్రిప్పులు వేయాలని ఆయన ఆర్టీసీ అధికారులను కోరారు. బస్సు సౌకర్యం కల్పనపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్‌వైజర్ అప్పారావు, గన్నేరుపుట్టు సర్పంచ్ ఎస్.కృష్ణారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

గంజాయి సాగుపై డ్రోన్‌లతో నిఘా: ఎస్ఐ

అనంతగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ నక్కులమామిడి, బూడ్డిగరువు గ్రామాల్లో అనంతగిరి ఎస్ఐ డి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని మంగళవారం డ్రోన్‌తో సర్వే నిర్వహించారు. గంజాయి సాగుపై సమాచారం రావడంపై ఉన్నతాధికారులు ఆదేశాలపై డ్రోన్‌తో ఆయా ప్రదేశాలను నిశితంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి సాగు చేసినట్లయితే, స్వచ్ఛందంగా ఆ మొక్కలను తీసివేయాలని సూచించారు.గం జాయికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలని, ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు


ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పాఠకులు, విద్యార్థులు

పాడేరురూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో లై బ్రేరియన్ మోరి సత్యవతి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతి నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, మ్యూజికల్ చైర్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు


వాలబు నుంచి సరియా మట్టిరోడ్డును బాగుచేస్తున్న గిరిజనులు

అనంతగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని, ఏదో చేస్తారని చూసినా ఫలితలేకపోవడంతో ఆ గ్రామాల గిరిజనులు తమ ఇబ్బందులకు తామే పరిష్కారం చూపుకున్నారు. అనంతగిరి, హుకుంపేట మండలాల సరిహద్దు గ్రామాలైన సరియా, గనికే గ్రామ గిరిజనులు స్వచ్ఛందంగా మట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. వాలబు నుంచి సరియా వరకు ఉన్న 12 కిలో మీటర్ల గల రోడ్డులో దాదాపు ఐదు కిలో మీటర్ల మేర మట్టిరోడ్డు. ఈ మార్గం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారింది. దీంతోఅధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టినా ఫలితం కానరాలేదు. ఈ స్థితిలోమంగళవారం సరియా, గనికే గ్రామాలగిరిజనులు మట్టిరోడ్డును తాత్కాలికంగా బాగుచేశారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు.

'నిధులు మాయం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి'

గూడెంకొత్తవీధి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లి పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మించకుండా నిధులు దోచుకున్న కాంట్రాక్టర్, ఉపాధి ఉద్యోగులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని టీడీపీనాయకుడు, స్థానిక సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గిరిజనులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టర్ రమేశ్, ఉపాధి అధికారులు కుమ్మక్కై పనులు చేయకుండగా రూ. 8 లక్షల నిధులు దోచుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకుల అండగా కాంట్రాక్టర్ రమేశ్ ఇష్టారీతిగా ప్రభుత్వసొమ్మును దోచుకున్నారన్నారు.

అంగన్‌వాడీలను ఇబ్బందులు పెట్టలేదు: పీవో

పాడేరురూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రాజెక్టు పరిధిలోని 184 అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, చార్టులు కొనుగోలుపై ఏ కార్యకర్తను ఇబ్బందికి గురిచేయలేదని సీడీపీవో పి.ఝాన్సీరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పాడేరులో శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన సూచనలపై అంగన్‌వాడీల్లో టోల్ ఫ్రీ చార్ట్, గ్రోత్ చార్ట్, మెనూ చార్ట్, ఫ్రీ స్కూల్ చార్ట్‌లు ఉండాలన్న ఆదేశాలపై చార్టులుకార్యకర్తలు స్వచ్ఛందంగా కొనుగోలు చేశారన్నారు. బ్యానర్ల ఖర్చు బడ్జెట్‌లో ఈ సొమ్ము జమచేస్తామని ఆమె వివరించారు.

చురుగ్గా రహదారుల మరమ్మతులు

- పట్టణంలో శరవేగంగా గుంతలు పూడ్చివేత
- త్వరలో రెండు కల్వర్టుల అభివృద్ధి పనులు ప్రారంభం

నర్సీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రహదారుల మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లపై పెద్ద గుంతలు పడి ప్రయాణం నరక ప్రాయంగా మారింది. వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరిగేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతలు లేని రోడ్లు లక్ష్యంగా మరమ్మతు పనులు మొదలుపెట్టింది. ప్రస్తుతం నియోజవర్గంలో రూ.41 లక్షలతో 19 రోడ్ల పనులు చేపడుతున్నారు. రెండో విడత ఆరు వర్కులకు రూ.43 లక్షలు, మూడో విడత మరో ఆరు వర్కులకు రూ.109 లక్షలు మంజూరఅయ్యాయి. ఈ పనులకు టెండర్లు పూర్తి చేశారు. శివపురం డీఎఫ్‌వో కార్యాలయం రోడ్డు కల్వర్టు అభివృద్ధికి రూ.15 లక్షలు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి సమీపంలోని కల్వర్టు నిర్మాణానికి రూ.55 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు కల్వర్టు పనులకు టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో పనులు మొదలు పెడతామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు.

అలాగే నర్సీపట్నం- దేవీపట్నం రోడ్డులో రూ.10 లక్షలతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి సమీపంలోని గుంతలు పూడ్చి తారు పోశారు. నర్సీపట్నం ఎక్సైజ్ కార్యాలయం దాటిన తర్వాత రూ.4 లక్షలతో మరమ్మతు పనులు పూర్తి చేశారు.


నర్సీపట్నం-చింతపల్లి రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్న దృశ్యం

పెదబొడ్డేపల్లి నుంచి నర్సీపట్నం అబీద్ సెంటర్ వరకు రూ.10 లక్షలతో రోడ్డు గుంతలు పూడ్చివేత పనులు చేపట్టారు. నర్సీపట్నం లారీ యార్డు నుంచి బలిఘట్టం, బయపురెడ్డిపాలెం వరకు రూ.10 లక్షలతో రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించారు.. గొలుగొండ మండలం కసిమిలో రెండు వర్కులకు రూ.7 లక్షలు, నాతవరం పీహెచ్‌సీ వద్ద రోడ్డు మరమ్మతు పనులకు రూ.10 లక్షలతో చురుగ్గా చేపడుతున్నారు. మాకవరపాలెం మండలంలో కొండల అగ్రహారం నుంచి రోలుగుంటకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు రూ.6 లక్షలు మంజూరయ్యాయి.


వామలింగేశ్వర దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా లక్షబిల్వార్చన

మాకవరపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పైడిపాల పెద్దమిల్లు జంక్షన్ వద్ద స్వయంభూ వామలింగేశ్వర స్వామి ఆలయంలో లక్షబిల్వార్చన నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఈ ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి. మండలం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దొరబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని దివ్యాంగుల విన్నపం


కోర్టు ఉత్తర్వులు చూపిస్తున్న దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు

గొలుగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని దివ్యాంగ పింఛనుదారులు మంగళవారం ఎంపీడీవో మేరీరోజీకి వినతిపత్రం అందించారు. మండలంలోని పాకలపాడు గ్రామంలో రెండు నెలల క్రితం సుమారు 18 దివ్యాంగుల పింఛన్లు స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారుల తొలగించారు. తమ పింఛన్లు పునరుద్ధరించాలని వారు కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఎంపీడీవోకు వినతిపత్రాలు అందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

నర్సీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శాఖా గ్రంథాలయంలో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. బ్యాంకు ఖాతా నంబర్లు, ఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఎవ్వకరికీ ఇవ్వద్దని తెలిపారు. తాత్కాలిక ఆకర్షణలకు లోనై జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. కొంత మంది యువకులు మాయ మాటలు చెప్పి వాట్సాప్‌లో యువతుల ఫొటోలు షేర్ చేయమంటారని, అలా చేస్తే మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం ఉందన్నారు. వాట్సాప్‌కి వచ్చిన లింక్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. నీలంపేటలో సైబర్ నేరస్తుల ఉచ్చుకి చిక్కుకొని మహిళ రూ.3.79 లక్షలు పోగొట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దమయంతి, ఎస్సీ బాలకల వసతిగృహం సంక్షేమ అధికారి జీవీవీ రాజ్యలక్ష్మి, లెక్చరర్ మేరీ పుష్ప పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై శిక్షణ తరగతులు

నర్సీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ సెంటర్‌లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం 18 నుంచి 40 సంవత్సరాలు మధ్య గల వారికి వ్యాపారం ప్రారంభించడం, ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ రుణాల మంజూరు తదితర ముఖ్య అంశాలను వివరించారు. అనంతరం ధృవపత్రాలు అందజేశారు. నైపుణ్యా భివృద్ధి సంస్థ జిల్లా అధికారి గోవిందరావు, ట్రైనర్లు అపూర్వ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

'నర్సీపట్నంలో శాంతిభద్రతలు క్షీణించాయి'


డీఎస్పీ మోహన్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, నంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ నియోజవకవర్గంలో శాంతిభద్రలు క్షీణించాయని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గం ముఖ్య నేతలతో కలిసి డీఎస్పీ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. నియోజవర్గంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారన్నారు. పది రోజుల క్రితం బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు మీద రౌడీషీటర్ హత్యాయత్నం చేశారని గుర్తు చేశారు. బతకు తెరువు కోసం నర్సీపట్నం వచ్చిన సర్వసుద్ధి నాగేశ్వరరావును ఆదివారం రాత్రి కొత్తవీధిలో రౌడీషీటర్ హత్య చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, చింతకాయల సన్యాసిపాత్రుడు, చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'శాంతిభద్రతల గురించి గణేశ్ మాట్లాడడమా?'

నర్సీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హత్యలు చేసిన వారిని వెంట పెట్టుకొని తిరుగుతూ శాంతిభద్రతల గురించి మాజీ ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరణ ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. మాకవరపాలెంలో వైసీపీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తూ పెద్దపల్లి సాయిలక్ష్మణను ట్రాక్టర్‌తో ఢీ కొట్టిన సంఘటనపై ఏ చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని విజయ్, లోకేశ్ ఆదుకున్న వి షయాన్ని గుర్తు చేశారు. దళిత డాక్టర్ సుధాకర్‌ను చిత్రహింసలకు గురిచేసి చనిపోవడానికి కారణం మీరు కాదా అని ప్రశ్నించారు.

పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ

కృష్ణాదేవిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాప్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సందర్భంగా పీహెచ్‌సీలో రోగులకు ఎస్ఐ .తారకేశ్వరరావు, వైద్యుల చేతుల మీదుగా రోగులకు పాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు వరహాలబాబు, నాగేశ్వరావు, రమణ, శివ, రామారావు పాల్గొన్నారు.

బహిరంగ మల విసర్జన విడనాడండి

ఎంపీడీవో భానోజీరావు... అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు

రావికమతం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కోసం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లనే వినియోగించాల ని ఎంపీడీవో హెచ్.భానోజీరావు పిలుపునిచ్చారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం రావికమతం, కొత్తకోట, టి.అర్జాపురం గ్రామాలలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మండల పరిషత్ ఏవో స్వామి, పంచాయతీ కార్యదర్శి పాతాళ సత్యారావు, కొత్తకోట ఈవో జ్యోతిశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చోడవరంలో..

చోడవరం: బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలకాలని ఎంపీడీవో వీవీఎస్ అంజనేయులు కోరారు. మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాడి కాసు మాట్లాడుతూ.. గ్రామాల్లో స్వచ్ఛభారత్ స్ఫూర్తిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఈవోపీఆర్‌డీ మహేష్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమని, మరుగుదొడ్ల వినియోగం ఆత్మ గౌరవం పెంపొందిస్తుందన్నారు.

నాతవరంలో...


నాతవరంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

నాతవరం: పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవడం అందరి బాధ్య అని సర్పంచ్ గొలగాని రాణీ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాతవరం పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరూ మరుగుదొడ్లు వినియోగిస్తేసే గ్రామాల్లో పరిశుభ్రత సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి పి.పార్థసారధి, గ్రామ పంచాయితీ విస్తరణాధికారి ఎన్‌వీఎస్ఎస్ మూర్తి, హౌసింగ్ ఏఈ రామజోగారావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి లాలం శేషు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సభను జయప్రదం చేయాలి

నర్సీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 10న నిర్వహించే సీపీఎస్ ఉద్యోగుల సహాసభను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం చ లో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు రీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, సెక్రటరీ జీవీ రమేశ్, బ్రహ్మజీ, దేముడు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

మాకవరపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ సూచించారు. మంగళవారం వీఆర్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటి తీరువా బకాయిలను వసూలు చేయాలన్నారు. మ్యుటేషన్లు రీ సర్వేలో వచ్చిన 770 పిర్యాదులను పరిశీలించాలన్నారు. రీ సర్వే డీటీ కృష్ణమూర్తి, ఆర్‌ఐ జట్టి పాల్గొన్నారు.

చిత్తులాటపై దాడులు

గొలుగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపేట గ్రామం వద్ద కొండపై చిత్తులాటపై దాడులు చేసినట్టు ఎస్ఐ రామారావు మంగళవారం తెలిపారు. నలుగురు వ్యక్తులను పట్టుకుని బైక్, ఏడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మరుగుదొడ్ల ఉపయోగాలపై అవగాహన ర్యాలీ

గొలుగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా గొలుగొండలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మేరీరోజీ మాట్లాడుతూ మరుగుదొడ్లను ప్రతీ ఒక్కరూ ఉపయోగించాలన్నారు. వీటివల్ల కలిగే లాభాలను వివరించారు. గతంలో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టలేని లబ్ధిదారులను గుర్తించి త్వరలో మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ ర్యాలీలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్‌రావు, ఏపీవో కరుణానిధి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలంబడి

గొలుగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలికమల్లవరం, నాగండొరపాలెం గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెక్కరాల్చు తెగుళ్లను గుర్తించడం జరిగిందని వ్యవసాయాధికారిని సుధారాణి తెలిపారు. దీని నివారణకుగాను వరి పొలంలో నీరు సమృద్ధిగా ఉంచాలని సూచించారు. ఇందుకోసం వ్యవసాయ అధికారుల సలహాలు పొందాలని కోరారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

గొలుగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాటుసారా క్రయ విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. నాలుగు గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యకులపై మంగళవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. నాటుసారా క్రయ విక్రయాలు చేపడితే స్థానికులు తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సామాన్యులకు అండగా టీడీపీ

- టీడీపీ యువనేత సకురు కోటేశ్వరరావు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న కోటేశ్వరరావు

చోడవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాన్యుల సంక్షేమం కోసం ఉద్భవించింది తెలుగు దేశం పార్టీ అని ఆ పార్టీ యువనాయకుడు సకురు కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, నాయకులు బొబ్బిలి ప్రసాద్, కుమార్, శివ పాల్గొన్నారు.

'పశుగ్రాసం పెంపునకు ఆర్థిక సాయం'

చీడికాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం నిధులతో వందశాతం సబ్సిడీతో పశుగ్రాసం పెంపునకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని పశుసంవర్థక శాఖ ఏడీ వి.చిట్టినాయుడు కోరారు. మంగళవారం మండలంలోని అర్జునగిరిలో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఈ పథకానికి వ్యవసాయ బోరు ఉండి, పది సెంట్లు నుంచి 50 సెంట్లు లోపల ఉన్న రైతులు అర్హులన్నారు. అలాంటి రైతులు స్థానిక వీఆర్పీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పశుగ్రాసం పెంచే రెండేళ్ల పరిమితికి రూ.26,039 ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా అందజేస్తుందన్నారు. ఈ సదస్సులో సర్పంచ్ బి.రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పెంటకోట అమ్మతల్లినాయుడు, రాఘవమ్మ, పాలకేంద్రం అధ్యక్షుడు శేషు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి మహాప్రభో


- ఎంపీడీఓకు రాజుల వీధి వాసుల వినతి

దేవరాపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాజుల వీధిలో వేస్తున్న రోడ్డు నిర్మాణానికి కొంతమంది అటంకం కలిగిస్తున్నారంటూ ఎంపీడీఓ సువర్ణరాజుకు ఆ వీధి వాసులు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. రోడ్డు, డ్రైనేజీ లేక 80 కుటుంబాలు వారు ఇబ్బందులు పడుతుంటే కేవలం మూడు కుటుంబాలు వారు నడిచే దారిని ఆక్రమించడమే కాకుండా అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించి రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వనభోజనాలు

దేవరాపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురెడ్డి వారి మామిడి తోటలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు మంగళవారం జరిగాయి. ఈ వనభోజనాల్లో మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, గాలి.రవి కుమార్, లలితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరిలో రెక్కరాల్చు పురుగు ఉధృతి నివారణకు చర్యలు


పొలంబడి నిర్వహిస్తున్న ఏవో పావని

చోడవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో రెక్కరాల్చు పురుగు ఉధృతి ఎక్కువ గా ఉందని, రైతులు ఈ తెగులు నివారణ చర్యలు చేపట్టాలని ఏవో పావని సూచించారు. మంగళవా రం మండలంలోని కన్నంపాలెం, తిమ్మనపాలెం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్కరాల్చు పురుగు ఉధృతి తగ్గించేందుకు క్లోరిఫైరిఫాస్ 2.5 ఎంఎల్ మందు లేదా, మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ మందు లీటరు నీటికి కలిపి సాయంత్రం పూట పురుగు ఆశించిన చోట పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకులు హరీష్, జ్యోతి, ఏఈవోలు కిరణ్, లక్ష్మణ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరిస్తే గ్రానైట్ తవ్వకాలకు అంగీకరిస్తాం

- తోటకూరపాలెం గ్రామస్థుల స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న పొల్యూషన్ కంట్రోల్ ఈఈ ముకుందరావు

రావికమతం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి సహకరిస్తే గ్రానైట్ తవ్వకాలకు తాము ఎటువంటి అభ్యంతరం చెప్పబోమని తోటకూరపాలెం గ్రామస్థులు స్పష్టం చేశారు. మంగళవారం తోటకూరపాలెం రెవిన్యూ పరిధిలో గ్రానైట్ తవ్వకాల క్వారీ విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. దీనిలో పాల్గొన్న నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ బి.వెంకటరమణ, విశాఖపట్నం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు క్వారీ అనుమతులకు గ్రామస్థులకు అభ్యంతరాలుంటే సభాముఖంగా తెలియజేయాలని కోరారు. ఈ క్వారీ వలన తాము పాక్షికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు సభ దృష్టికి తెచ్చారు. భారీ వాహనాల రాకపోకల వలన రోడ్లు ధ్వంసమవుతున్నాయని మరికొందరు పేర్కొన్నారు. అయినప్పటికీ క్వారీ యాజమాన్యం తమ గ్రామంలో రెండు ఆలయాల నిర్వహణ బాధ్యత, ఆర్వో వాటర్‌ప్లాంట్, డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, తోటకూరపాలెం-కన్నూరు పాలెం వరకూ రోడ్డు మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయాలని కోరారు. వీటికి యాజమాన్యం అంగీకరిస్తే గ్రానైట్ తవ్వకాలకు ఎటువంటి అభ్యంతరం తెలపమన్నారు. సభలో ఉన్న ఉషశ్రీ రిప్రజెంటివ్ గిరీష్ తోటకూరపాలెం గ్రామస్థుల డిమాండ్లను అంగీకరించారు. గ్రామస్థులు, అధికారులు సభ దృష్టికి తీసుకొచ్చిన అంశాలన్ని యథావిధిగా జిలా కలెక్టర్‌కు పంపుతామని ఆర్డీవో వీవీ రమణ ప్రకటించారు.

ప్రజలకు సేవలందించండి

- మండల నోడల్ అధికారి శిరీషా


కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అదికారి శిరీషా

మాడుగుల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సంతృప్తిస్థాయిలో సేవలు అందించేందుకు అధికారులు మమేకమై ఉండాలని మండల నోడల్ అధికారి, జిల్లా ట్రైబల్ ఆఫీసర్ శిరీషా అన్నారు. మంగళవారం శంకరం, తాటిపర్తి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దార్తి అభ జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లు- సామాజిక అవసరాలు, ఆరోగ్యం- పోషణ, విద్య- శిక్షణ, విద్యుత్ , ఉపాధి అవకాశాలు, ఫోర్ జి కనెక్టవిటీ ఈ అంశాలపై ఆయా గ్రామాలకు ప్రజలకు సంతృప్తిస్థాయిలో సేవలు అందివ్వాలన్నారు. ఇందుకు సంబంధిత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు


రోలుగుంట: విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


రావికమతం: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రావికమతం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథ పాలకురాలు ఆర్.వరహామణి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కొత్తకోట జడ్పీ హైస్కూల్, సెంట్‌మేరీ, ఆర్క్‌బర్డ్, విద్యాంజలి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. మహిళ దినోత్సవం పరస్కరించుకొని మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చోడవరంలో..గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణానికి చెందిన పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి జి. తిరుమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో.. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కె.కోటపాడు, చౌడువాడ శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో శాఖా గ్రంథాలయాధికారిణిలు కె.సౌమ్య, మడ్డు పద్మావతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడలో.. స్థానిక గ్రంథాలయంలో స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోలుగుంటలో.. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి ఎస్.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సీపీఎం


స్మార్ట్ మీటర్లను చూపుతున్న డి.వెంకన్న

దేవరాపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. దేవరాపల్లిలో రహస్యంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారన్నారు. విశాఖలో మొదలు పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులు గొట్టండని ఎన్నికల ముందు పిలుపునిచ్చిన నారాలోకేష్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

కూండ్రపువానిపాలెంలో సత్యసాయి వ్రతాలు


సత్యసాయిబాబా జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూండ్రపువానిపాలెం శ్రీరామ సత్యసాయి మందిరంలో సత్యసాయి వ్రతాలు మంగళవారం నిర్వహించారు.సత్యసాయి చిత్రపటానికి సత్యసాయి సేవా సంస్థల అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, జూరెడ్డి రాము, కన్నూరు సూర్యనారాయణ పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి కన్వీనర్ కన్నూరు చెల్లిబాబు, శ్రీదేవి దంపతులతోపాటు 80 మంది మహిళా భక్తులు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బండారు గురువులు, బండారు రామలక్ష్మి, కశిరెడ్డి ప్రసన్న, బండారు కన్నబాబు, కళ్లెంపూడి శ్రీను, నాగమణి, ప్రభ, నక్కెళ్ల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

చోడవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వికాస మహిళా బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు యువత, బలహీనవర్గాల కోసం సహకార సంఘాల అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వికాస బ్యాంకు ఎండీ కోన సరోజ, సీఈవో సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షురాలు మజ్జి రమణమ్మ, జిల్లా సహకార శాఖాధికారి జి. సోమేశ్వరరావు పాల్గొన్నారు.

కొండ్లకొత్తూరులో తాగునీటి సమస్య

చీడికాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం శివారు కొండ్లకొత్తూరు గిరిజన గ్రామంలో తాగు నీటి కోసం గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా పైప్ లైన్ పగిలిపోవడంతో భూమిలో నుంచి వస్తున్న నీటిని గిరిజనులు తాగుతు న్నారన్నారు. దీనిపై గ్రామ సచివాలయ అధికారులకు తెలిపినా స్పందించ లేదన్నారు. కలుషితనీరు తాగడంతో వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, మండల స్థాయి అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు.

600 లీటర్ల బెల్లపు పులుసు ధ్వంసం

కె.కోటపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరువాడలో మంగళవారం తుమ్మచెరువు పరిసర ప్రాంతంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లపు పులుసును ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ ఎం. శేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన కక్కల రాము సారా తయారు చేస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. పూర్తి దర్యాప్తు జరిపి, ఎవరెవరు బట్టీలు నిర్వహిస్తున్నారో వారందరిపైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడిలో హెచ్‌సీ ఎం.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

టి.అర్జాపురంలో సంకష్టహర చతుర్థి పూజలు

రావికమతం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం బాలవర సిద్ధి వినాయకుని ఆలయంలో మంగళవారం సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గుంటూరు లక్ష్మణ శర్మ, రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాలు, పలు అభిషేకాలు, శాంతి హోమం, తదితరాలను నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కలువల సృష్టికర్త!

అనేక వర్ణాలతో సరికొత్త పూలు

100 రకాల కలువ మొక్కలకు ప్రాణం



అతనికి కలువ పూలు అంటే అమిత ప్రేమ. చిన్నప్పటి నుంచీ వివిధ ప్రాంతాల్లో కనిపించే కలువులు, తామరలను దగ్గరగా పరిశీలించడం, కేవలం మూడు నాలుగు రంగుల్లోనే లభిస్తుండడం అతనిని ఆలోచింపజేసింది. కలువ మొక్కలు అంటుకట్టి హైబ్రిడ్ పద్ధతిలో కొత్త జన్యువును సృష్టిస్తే మరిన్ని వర్ణాలతో అందమైన పూలను పూయించవచ్చని భావించారు. అంతే తనకు వచ్చిన ఆలోచనను ఆచరణలో పెట్టి ప్రస్తుతం 100 రకాల కలువలు, తామరలకు జీవం పోశారు.

- మధురవాడ, ఆంధ్రజ్యోతి

వివిధ రంగుల్లో కలువలు







» విదేశీ హైబ్రీడైజర్‌లతో పరిచయం

» మధురవాడకు చెందిన అనలేందు రాయ్ ఘనత

ఒకప్పుడు గ్రామాల్లోని చెరువులు, కోనేరుల్లో కనిపించే కలువలు, తామరలు ప్రస్తుతం పట్టణాల్లో మిద్దెపై సాక్షాత్కరిస్తున్నాయి. దేవతల పుష్పాలుగా పేర్గాంచిన ఈ పూలు ఆకర్షణీయ రంగులతో అలరిస్తుంటాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఇవి సాధారణంగా ఎరుపు, నీలం, తెలుపు వర్ణాల్లోనే కనిపిస్తుంటాయి.. కానీ ఈ మొక్కలను ఎంపిక చేసుకొని అంటుకట్టే (హైబ్రీడ్) పద్ధతిలో సరికొత్త రంగుల్లో కలువులు పూయిస్తున్నారు మధురవాడ జీసీసీ లేఅవుట్‌కు చెందిన అనలేందు రాయ్. కలువల్లో నూతన మొక్కలను సృష్టించే వారిని ఆంగ్లంలో హైబ్రీడైజర్ అంటారు.

పశ్చిమబెంగాల్‌కు చెందిన రాయ్ బతుకుతెరువు కోసం ఏళ్ల కిందట నగరానికి వచ్చారు. మధురవాడ జీసీసీ లేఅవుట్‌లో స్థిరనివాసం నిర్మించుకుని, ఓ పాఠశాలను నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి తాను ఎంతగానో ముచ్చటపడే కలువ మొక్కలను పెంచడాన్ని హాబీగా చేసుకున్నారు. జీసీసీ లేఅవుట్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివసిస్తున్న రాయ్ పైఅంతస్థులో టెర్రస్‌పై పెద్దపెద్ద ప్లాస్టిక్ తొట్టెల్లో వివిధ రకాల కలువలు, తామర పూల మొక్కలు పెంచుతున్నారు. వీటితో పాటు పదుల సంఖ్యలో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను కూడా పెంచుతున్నారు.

విదేశాల నుంచి మొక్కలు..

రాయ్ తనకున్న ఆసక్తితో మన దేశంలో లభించే మొక్కలతో పాటు వివిధ దేశాల నుంచి కలువ, తామర పూల మొక్కలు తెప్పించారు. వాటిని హైబ్రీడైజ్ చేసి కొత్త రంగుల పూలను సృష్టించారు. ఈ పూలకు పేర్లను కూడా ఆయనే పెడుతుంటారు. ప్రస్తుతం ఇతని వద్ద మన-999, ప్రణవ్-9, వసంత్-9, నిర్భయ-9 తదితర 100 రకాల సంకరజాతి మొక్కలున్నాయి. వీటిలో కొన్నింటిని విదేశాలకు కూడా ఎగుమతి చేశారు.

విదేశీ హైబ్రీడైజర్లుతో పరిచయం..

ఈ రంగంలో రాయ్‌కు ఉన్న ఆసక్తి విదేశీ హైబ్రీడైజర్లుతో పరిచయం పెంచుకునేలా చేసింది. థాయ్‌లాండ్‌కు చెందిన నోష్ చయ్‌చాన్‌శిల్ప, అమెరికాకు చెందిన రిచ్‌శేచర్, జర్మనీకి చెందిన వాసుమనికమ్ తదితరులతో ఏర్పడిన పరిచయం మొక్కల హైబ్రీడైజర్‌కు సాయపడింది. ఆయా దేశాల్లో లభించే అరుదైన, రంగు, సువాసన, వివిధ రకాల వినూత్న పత్రాలతో ఉండే కలువలు, తామర మొక్కలను రాయ్ ఇక్కడికి తెప్పించారు. ఇక్కడ లభించే కొన్ని సంకరజాతి మొక్కలను ఆయా దేశాలకు పంపించారు. రాయ్ టెర్రస్‌పై ఆస్ట్రేలియా, అమెరికాకు చెందిన వాటర్‌లిల్లీ, లోటస్‌లు కూడా ఉన్నాయి.

కలువలంటే ప్రాణం..



ఎంతో సుకుమారంగా ఉండే కలువలు, తామరపూలంటే ఇష్టం.. వాటిని ఇంటిపైనే కుండీల్లో పెంచుతున్నాను. రోజుకు నాలుగు గంటలు ఈ మొక్కల సంరక్షణకు కేటాయిస్తునాను. పురుగులు, తెగుళ్ల సోకకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వివిధ దేశాల్లోని 25 మంది హైబ్రీడైజర్లలో ఒకడిగా ఉండడం ఆనందం. సంకరజాతి కలువలు, తామరపూలు సృష్టించడంలో వివిధ మాధ్యమాల నుంచి సమాచారం సేకరిస్తుంటాను. అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాప్‌లకు హాజరవుతుంటాను. ఎక్కడి నుంచైనా కొత్త విషయాలు గ్రహిస్తే వాటిని ముందుగా మా ఇంట్లో పెంచే కలువల పైనే ప్రయోగిస్తాను. ప్రస్తుతం నా వద్ద 100 రకాల కలువలు, తామర పూలు పూసే మొక్కలున్నాయి. భవిష్యత్తులో మరికొన్ని రకాలు సృష్టిస్తాను.

- అనలేందు రాయ్, హైబ్రీడైజర్

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

» ఎస్పీ తుహిన్ సిన్హా



మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

నర్సీపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని విద్యార్థులకు ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలను తెలియజేయడానికి సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒకసారే కదా అని మాదక ద్రవ్యాలు తీసుకుంటే, వాటికి బానిసలు కావడానికి ఎంతో సమయం పట్టదన్నారు. ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉన్న నర్సీపట్నంలో గంజాయి రవాణా, వినియోగం ఎక్కువగా ఉందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గంజాయి సేవించడంతో పాటు రవాణాకి పాల్పడుతుండడం బాధాకరమని తెలిపారు. గంజాయితో పోలీసులకు పట్టుబడితే గరిష్ఠంగా 20 సంవత్సరాలు జైలుశిక్ష పడుతుందన్నారు. నేరస్థులుగా మారిన యువతపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఉద్యోగంలో చేరినా, విదేశాలకు వెళ్లాలనుకున్నా పోలీసుల వెరిఫికేషన్‌లో పాత నేరస్థులని తేలితే ఉద్యోగం కోల్పోతారని తెలిపారు. బి స్మార్ట్, డోన్ట్ స్టార్ట్ అని విద్యార్థులతో నినాదాలు చేయించారు. మాదక ద్రవ్యాలు వినియోగించే వారు, అమ్మేవారు, సరఫరా చేసే వారి సమాచారం 9392918196 ఫోన్ నంబరుకి ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డౌనూరు చెక్ పోస్టు, పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్, సీఐలు గోవిందరావు, రేవతమ్మ, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో గురుకుల విద్యార్థుల సత్తా



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన గురుకుల విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరాపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ నెల 14 నుంచి 16 వరకు విజయనగరం జిల్లా కొప్పెర్లలో జరిగిన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొనగా సీనియర్స్ విభాగంలో కోకో, కబడ్డీ, విన్నర్స్‌గాను హ్యాండ్ బాల్ రన్నర్స్‌గాను, 400 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్ సూర్య కిరణ్ రజిత పతకం, జూనియర్స్ విభాగంలో కోకో విన్నర్స్ వాలీ బాల్ రన్నర్స్‌గాను విజయాలు సొంతం చేసుకున్నారు. 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.గౌరీ మణిశంకర్, వినయ్‌కుమార్ రజితం, కాంస్య పతకాలు సాధించారు. 800 మీటర్ల పరుగులో ఆర్.తరుణ్ స్వర్ణం, 1500 మీటర్ల పరుగు పందెంలో బి.పార్థు స్వర్ణ పతకం సాధించాడు. జూనియర్స్ లాంగ్ జంప్, జావెలిన్‌త్రోలో సాయి వరుసగా స్వర్ణ, రజిత పతకాలు సాధించాడు. రిలే పరుగు పోటీల్లో జి. గౌరీమణిశంకర్, బి.వినయ్, ఆర్‌తరుణ్, సాయి స్వర్ణ పతకాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ పి.రఘు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

పల్లెల్లో అభివృద్ధి పండుగ

... 5వ పేజీ తరువాయి

బుచ్చెయ్యపేట మండలంలో రూ.73 లక్షలతో 7 పనులు, చోడవరం మండలంలో రూ.11 కోట్ల 21 లక్షలతో 136 పనులు చేస్తున్నారు. అన్ని మండలాల్లో పనులు ప్రారంభం కావడం, ఇసుక అందుబాటులో వుండడంతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

నాణ్యత లోపిస్తే...

ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే పనుల నాణ్యత విషయంలో గతంలో పెద్దగా పట్టింపులు ఉండేవి కావు. దీంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించి కొద్ది రోజులకే నాణ్యత లోపాలు బయటపడేవి. గత ప్రభుత్వ హయాంలో ఇదే విధంగా పనులు జరిగాయి. కానీ కూటమి ప్రభుత్వం.. ఉపాధి నిధులతో చేపట్టే ఇంజనీరిగ్ పనుల్లో నాణ్యత లోపిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. దీంతో అధికారులు దగ్గరుండి మరీ పనులు చేయిస్తున్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడడంలేదు. ప్రతి పని వద్ద కనీసం ఇద్దరు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వుంటున్నారు. సిమెంట్, ఇసుక, పిక్కను నిర్ణీత నిష్పత్తి ప్రకారం మిక్సింగ్ చేసేలా చూస్తున్నారు. పూర్తయిన పనులకు కనీసం పది రోజులపాటు వాటర్ క్యూరింగ్ చేస్తున్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో 27 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను విశాఖ ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని 27 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌పై తనిఖీ చేస్తున్నప్పుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్రను పట్టుకుని 17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఢిల్లీకి రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన దీపాన్సు పరిహార్, గౌతమ్ సింగ్‌ను అరెస్టు చేసి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పూడిమడక హార్బర్ పనులను పరిశీలించిన కలెక్టర్



హార్బర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అచ్యుతాపురం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పూడిమడక హార్బర్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం పరిశీలించారు. తొలుత పూడిమడక - లోవపాలెం ప్రధాన రహదారి నుంచి హార్బర్ ప్రాంతం వరకు వేసిన రోడ్డుతోపాటు తీరంలో నిర్మాణంలో వున్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను ఆమె సందర్శించారు. హార్బర్ ప్లానింగ్ నమూనాను స్థానిక అధికారులు ఆమెకు చూపి వివరాలు తెలిపారు.

ఈ నెల 29వ తేదీన పూడిమడక సమీపంలో ఎన్‌టీసీపీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. దీనికి సమీపంలో వున్న పూడిమడక హార్బర్ నిర్మాణ పనులను సీఎం, అధికారులు పరిశీలించే అవకాశం వుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించినట్టు తెలిసింది.

ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య పెరగాలి

» రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం దేశానికే మార్గదర్శకం

» కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది



భీమిలి మండలం మజ్జిపేటలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న దక్షిణాది రాష్ట్రాల అధికారులు

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేది పేర్కొన్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య మరింత పెరగాలని, ఇందుకు ప్రభుత్వం సహకారాన్ని అందించాలన్నారు. ఈ బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపైనే ఉందన్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే అవకాశం ఉందన్నారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు మూడు బృందాలుగా విడిపోయి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఒక బృందం భీమునిపట్నం మండలం మజ్జిపేట, కోరాడ గ్రామాలను సందర్శించింది. మజ్జిపేటలో ఆడారి కిశోర్‌కుమార్, ఇతర రైతులు 8.2 ఎకరాల్లో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని, ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో జీవామృతం తయారీ విధానాన్ని సందర్శించింది. రైతులు అవలంబిస్తున్న సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రభుత్వ సలహాదారు (వ్యవసాయం- సేంద్రియ సాగు విధానాలు) రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ బృందానికి వివరించారు. మరో బృందం పద్మనాభం మండలం కోరాడ గ్రామంలో వై.పార్వతి మరికొద్దిమంది రైతులతో కలిసి సాగు చేస్తున్న వరి కాంపాక్ట్ బ్లాక్‌ను సందర్శించింది. అదే గ్రామంలో మజ్జి లక్ష్మి వ్యవసాయ క్షేత్రంలోని బొప్పాయి, ఆకుకూరలు, వరిలో లైన్‌సోయింగ్ పద్ధతులను తెలుసుకుంది. అనంతరం మూడు బృందాల అధికారులు స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత, ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ వివరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ పేరిన్ దేవి, ఏపీ వ్యవసాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, అదనపు కార్యదర్శులు మునిందర్ కౌర్ ద్వివేది, శుభాఠాకూర్, డాక్టర్ ప్రకోప్‌కుమార్ మేఘర్థ, జాయింట్ సెక్రటరీ అజిత్ కుమార్‌సాహు, తదితరులు పాల్గొన్నారు.

తాండవలో ఎండుతున్న వరి

... 5వ పేజీ తరువాయి

నిరంతరం నీరు వృథాగా పోతూ, మెరక భూములకు నీరు అందడంలేదు. కుడి కాలువ చివరనున్న కేఈ చిన్నయ్యపాలెం, రామకృష్ణాపురం గంగవరం, తిమ్మరాజుపేట తదితర గ్రామాల్లో వరి పొలాలకు నీరు అందక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దాదాపు నెల రోజుల క్రితం వరకు వర్షాలు పడుతుండడంతో నీటి ఎద్దడి ఏర్పడలేదు. తరువాత నుంచి వర్షాలు లేకపోవడంతో ఆయకట్టుకు నీటి వినియోగం పెరిగింది. దీంతో చివరి భూములకు నీరు రాని పరిస్థితి నెలకొంది.

నాలుగో వంతుకు తగ్గిన లష్కర్లు

తాండవ ఆయకట్టు పరిధిలో కాలువల పర్యవేక్షణ కోసం గతం 40 మంది వరకు లష్కర్లు వుండేవారు. వీరు నిరంతరం కాలువలను పరిశీలిస్తూ.. నీరు ఎక్కడ అవసరమో అక్కడ తలుపులు తెరచి నీటి విడుదల చేసి, అవసరం లేనిచోట తలుపులు మూసివేసేవారు. కానీ ప్రస్తుతం 10 మంది మాత్రమే లష్కర్లు వున్నారు. దీంతో కాలువలపై పర్యవేక్షణ తగ్గిపోయింది. కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీయించాలని ఖరీఫ్ మొదలవడానికి రెండు నెలల ముందే అధికారులను కోరినప్పటికీ పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన వరిపంట ప్రస్తుతం పొట్టదశకు వచ్చిందని, ఇటువంటి తరుణంలో నీటి ఎద్దడి ఏర్పడితే తీవ్రంగా నష్టపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరందక వరి ఎండిపోతోంది



ఈగల లోవ రైతు, రాజవరం

నేను మూడు ఎకరాల్లో వరిపంట వేశాను. కుడి కాలువలో మూడేళ్ల నుంచి పూడిక తీయలేదు. దీంతోపాటు నాచు కూడా విపరీతంగా పెరిగిపోయి నీటి ప్రవాహం మందగించింది. దీనివల్ల చివరి భూములకు నీరు అందడం లేదు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరిపంటకు నీరు అందక నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అధికారుల నిర్లిప్తత వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు.

తాండవకు రూ.2.1 కోట్లు మంజూరు

అనురాధ, డీఈఈ, తాండవ ప్రాజెక్టు

తాండవ రిజర్వాయర్‌కు ప్రభుత్వం రూ.2.1 కోట్లు మంజూరు చేసింది. జనవరిలో తాండవ మెయిన్‌గేట్లకు మరమ్మత్తులు, ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడిక, నాచును తొలగిస్తాం. కుడి కాలువపై గుమ్మిడిగొండ, రొంగల కొత్తూరు వద్ద, ఎడమ కాలువ 1.5 కిలోమీటరు వద్ద అక్విడక్టులకు మరమ్మతులు చేయిస్తాం.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

» ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

» క్షతగాత్రుల స్వస్థలం ఖమ్మం



తీవ్రంగా గాయపడిన పద్మావతి, లక్ష్మీశ్రీకరి, అశోక్‌కుమార్

అనకాపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆగి వున్న లారీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన వారు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఖమ్మంలోని జిల్లా పరిషత్ క్వార్టర్స్ ప్రాంతంలో నివాసం వుంటున్న అంబా అశోక్‌కుమార్ కుమార్తె వివాహానికి ఆయనతోపాటు కుటుంబ సభ్యులు, బంధువులు విశాఖపట్నం వచ్చారు. మంగళవారం ఉదయం అంబా అశోక్‌కుమార్, భార్య పద్మావతి, బంధువులు పి.అన్నపూర్ణ, పి.లక్ష్మీశ్రీకరి కలిసి కాకినాడ జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రానికి కారులో వెళ్లారు. సత్యనారాయణస్వామి దర్శనం చేసుకుని తిరిగి విశాఖపట్నం వెళుతుండగా అనకాపల్లి బైపాస్ రోడ్డులో 'డైట్' కళాశాల సమీపాన రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో నలుగురికీ తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ రామలింగం క్షేమంగా బయటపడ్డాడు. క్షతగాత్రులకు స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటనారాయణ తెలిపారు.

135 కిలోల గంజాయి స్వాధీనం

» నలుగురి అరెస్టు » నిందితుల్లో ఒకరు బాలుడు



పట్టుకున్న గంజాయి, కారు, నిందితులతో హుకుంపేట పోలీసులు

హుకుంపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగుడుపుట్టు కూడలి వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు 135 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక ఎస్ఐ సురేశ్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలో దిగుడుపుట్టు కూడలి వద్ద పోలీసులు తనిఖీలు చేపడుతున్న క్రమంలో ఓ కారు, దానికి పైలట్‌గా ఒక బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వేగంగా వచ్చి పోలీసులను చూసి కంగారు పడుతుండడంతో వారిని పట్టుకున్నారు. కారులో 3 బస్తాల్లోని 135 కిలోల గంజాయి ఉందని గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశారు. ఇందులో ఒకరు బాలుడు కావడం విశేషం. వీరంతా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా తెంతులుగుడ వాసులుగా గుర్తించామని ఎస్ఐ పేర్కొన్నారు.

నేటి నుంచి అరకులో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

» 28 ఏకలవ్య పాఠశాలల నుంచి 1,200 మంది హాజరు

అరకులోయ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అరకులోయ గురుకుల బాలుర క్రీడా పాఠశాలలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28 ఏకలవ్య పాఠశాలల నుంచి సుమారు 1200 మంది బాలబాలికలు, ఆయా పీడీలు పాల్గొననున్నట్టు తెలిపారు. గేమ్స్, స్పోర్ట్సుకు సంబంధించి 22 విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలను స్థానిక క్రీడా పాఠశాల మైదానంలో బుధవారం ఉదయం ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు.